ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

మంగళవారం 2 జూలై 2024 | 5




నేను మీ వాడిని : గొల్లప్రోలు సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభివాదం


నువ్వు చల్లగుండాలయ్యా : వృద్ధురాలి ఆశీర్వాదం

పింఛన్.. ఆనందించేన్..

తూర్పుగోదావరి	
లబ్ధిదారులు :	2,41,771
అందుకున్నవారు :	2,32,840
మొత్తం శాతం :	96.31

అంబేడ్కర్ కోనసీమ	
లబ్ధిదారులు :	2,43,534
అందుకున్నవారు :	2,33,944
మొత్తం శాతం :	96.06

కాకినాడ	
లబ్ధిదారులు :	2,79.319
అందుకున్నవారు :	2,62,423
మొత్తం శాతం :	93.95


కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన చేనేత కార్మికులు, కొప్పుల సత్యవతి, గుత్తి సూర్యకాంతం


మీకు మేమున్నాం : నిడదవోలు మండలం గోపవరంలో దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి దుర్గేష్


హ్యాపీగా బతకాలి : రాజమండ్రి 11వ డివిజన్ పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే వాసు


ఎవరిపై ఆధారపడకుండా : రాజమండ్రి రూరల్‌లో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల


బామ్మ..పింఛన్ పెంచాం : బిక్కవోలులో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


అమ్మా ఆనందమేనా : రాజానగరంలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల చిత్రంలో బీవీఆర్ చౌదరి


హామీ ఇచ్చాం..నెరవేర్చాం : కొవ్వూరులో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ద్విసభ్య కమిటీ సభ్యులు


పెన్షన్.. ఇక నో టెన్షన్ : దేవరపల్లిలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

కూటమి తొలి అడుగే.. సూపర్‌హిట్

- ఇంటి వద్దనే రూ.7 వేలు అందెన్
- పండుగలా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 2,32,840 మందికి అందజేత
- పంపిణీ చేసిన మొత్తం రూ.157.32 కోట్లు
- ఉదయం 5 గంటలకు ఆరంభం
- రాత్రి 7.30 గంటల వరకూ పంపిణీ
- ప్రభుత్వ ఉద్యోగులకు అభినందన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కూటమి వచ్చింది.. ఇంటింటా ఆనందం తెచ్చింది.. హామీలు ఇచ్చారు.. ఎలా చేస్తారో చూస్తాం అంటూ గత పాలకులు చేసిన విమర్శలకు ధీటుగా పింఛన్ల పంపిణీ సాగింది.. వలంటీర్లు లేక పోయినా తొలిరోజే ఏకంగా 96.31 శాతం పింఛను పంపిణీ చేసి చూపించారు..శెహబాస్ అనిపించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఓ పండుగలా సాగింది. ఉదయం 6 గంటలకు లబ్ధిదారుల ఇళ్లకు చేరుకున్న సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, టీడీపీ ,జనసేన,బీజేపీ శ్రేణులు అవ్వా తాతలు, దివ్యాంగులు, కళాకారులను లేపి పింఛన్లు అందజేశారు. ఒక్కరోజే జిల్లాలో ఏకంగా 96.31 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది.

ఒక్కరోజులోనే 96.31 శాతం..

గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా 1 నుంచి 5వ తేదీ వరకూ పింఛన్లు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఏకంగా ఒకే ఒక్క రోజులో 96.31 పింఛన్లు పంపిణీ చేసి అభాగ్యుల గుండెల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఊళ్లో లేనివారి, ఇతర కారణాల వల్ల బయట ఉన్నవారికి తప్ప మిగతా వారందరికీ పింఛన్లు అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల జోక్యం వద్దని ఎన్నికల కమిషన్, కోర్టు ఆదేశించడంతో గత వైసీపీ ప్రభుత్వం రెండు నెలల పాటు పింఛన్‌దారులకు చుక్కలు చూపించిన సంగతి తెలిసిందే. వలంటీర్ల చేత బలవంతంగా రాజీనామాలు చేయించారు. వలంటీర్లు లేకపోతే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ జరగదని.. సచివాలయ ఉద్యోగుల వల్ల సాధ్యం కాదని తేల్చేశారు. పింఛన్ల పంపిణీలోనూ ఓటు రాజకీయం చేశారు. పింఛను సొమ్ము బ్యాంక్ ఖాతాల్లో వేసి పింఛన్‌దారులకు నరకం చూపించారు. పైగా ఈ నెపాన్ని చంద్రబాబుపై తోయడానికి వైసీపీ విశ్వప్రయత్నం చేసింది. అప్పటికే ఎన్నికల ప్రచారం నిమిత్తం జిల్లాలోని నల్లజర్లలో ఉన్న చంద్రబాబు అక్కడే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తాను పింఛన్ రూ.4 వేలు చేయడంతో పాటు, ఏప్రిల్ నుంచే అమలు చేసి, జూలై1న రూ.7 వేలు ఇస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయన తన మాటను నిలబెట్టుకున్నారు. పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు పోటీ పడ్డారు.నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ పలుచోట్ల పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బూరు గుపల్లి శేషారావు ఉన్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు , రాజానగరంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ, అనపర్తిలో బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు గ్రామ గ్రామాన పింఛన్లు పంపిణీ చేశారు.

ఉదయం 5 గంటలకే ఆరంభం..

సోమవారం ఉదయం 5గంటలకు మొదలైన పింఛన్ల పంపిణీ పండగా ఉదయం 8.30 గంటలకే 45 శాతం దాటేసింది. ఇది ఒక జాతరలా సాగింది. కానీ సర్వర్లు డౌన్ కావడం వల్ల సుమారు రెండు గంటల పాటు ఇబ్బంది ఏర్పడింది. అయినా చంద్రబాబు భరోసాను ఓ చాలెంజ్‌గా తీసుకున్న సచివాలయ, ఇతర ఉద్యోగులు టిఫిన్ కూడా మానేసి పింఛన్ల పంపిణీపైనే దృష్టి సారించారు.కొందరు మధ్యాహ్నం భోజనం కూడా చేయలేదు.జిల్లా యంత్రాంగం పగడ్బంధీ ఏర్పాట్లు చేయడంతో పాటు శనివారం సాయంత్రమే పంపిణీకి సంబంధించిన సొమ్మును ఉద్యోగులకు అందజేసింది. దీని వల్ల వారు ఇళ్లకు తీసుకుని వెళ్లి రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేలు వంతున వేర్వేరు కట్టలుగా కట్టుకుని సిద్ధం చేసుకు న్నారు.దీంతో పంపిణీ సులభమైంది. ఉద్యోగులకు తోడుగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అన్ని చోట్ల భాగస్వాములయ్యారు.

పింఛన్ల పంపిణీ సాగిందిలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	పంపిణీ
రాజమండ్రి సిటీ	29,436	20,24,48,000
రాజమండ్రి రూరల్	32,006	21,78,95,500
రాజానగరం	39,777	26,67,14,500
అనపర్తి	30,260	20,21,92,500
నిడదవోలు	35,817	24,18,17,500
గోపాలపురం	32,058	21,80,25,000
కొవ్వూరు	31,716	21,24,31,716


రంగంపేటలో చంద్రబాబు చిత్రపటానికి పింఛనుదారుల పాలభిషేకం

ఒక్కరోజే 2,32,840 మందికి అందజేత

జిల్లాలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు 95.87 శాతం పంపిణీ చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం 5 గంటలకే ప్రారంభించినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 4092 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి నగదు పంపిణీ చేశారన్నారు. రాత్రి 7.30 గంటల వరకూ పింఛన్లు పంపిణీ చేశారని తెలిపారు. నగదుతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశలేఖను అందజేశామన్నారు. జిల్లాలో మొత్తం 2,41,771 మంది పింఛనుదారులు ఉండగా ఒక్కరోజులోనే ఏకంగా 2,32,840 మందికి పంపిణీ చేశామన్నారు.మొత్తం రూ.163.36 కోట్లు అందించాల్సి ఉండగా రూ.157.32 కోట్లు పంపిణీ చేశామన్నారు. మంగళవారం సాయంత్రంలోపు మొత్తం అందరికీ పింఛన్లు పంపిణీ చేసే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.తొలిరోజే సుమారు 96 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసిన సచివాలయ,ఉద్యోగులను అభినందిస్తున్నట్టు తెలిపారు.

హ్యాపీగా ఉండండి : కలెక్టర్ ప్రశాంతి

హ్యాపీనా! అందరూ సంతోషంగా ఉన్నారా.. సీఎం నారా చంద్రబాబు నాయుడు పెంచిన పింఛన్లు తీసుకుని హ్యాపీగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి లబ్ధిదారులతో ముచ్చటించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్‌లో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమహేంద్రవరం 11వ డివిజన్‌లో ఎందుకు ఆరంభించామో తెలుసా? గతంలో పింఛన్లు ఇవ్వడానికి మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన జగన్‌కు ప్రజలు ఇచ్చిన 11 సీట్లు గుర్తు చేయడానికేనని అనడంతో అందరూ నవ్వుకున్నారు.

పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా

- పనిచేసే..మన్ననలను పొందుతా
- రక్షణ పేరుతో ఆంక్షలు వద్దు
- స్థలం చూస్తున్నా.. ఇల్లు కట్టుకుంటా
- ఉపాధిని మెరుగుపరుస్తా
- పింఛన్ల పంపిణీ సభలో పవన్

పిఠాపురం/గొల్లప్రోలు, జూలై 1: దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించాల్సి ఉందన్నారు. కొత్తపల్లి మండలంలోని సముద్రపు తీరప్రాంతాల్లో తాగునీటి కోసం అక్కడ మహిళలు పడుతున్న కష్టాలను తాను స్వయంగా చూశానని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లోని కొన్ని గ్రామాలను ఎంపిక చేసి అక్కడ నూరు శాతం శానిటేషన్ చేయడంతో పాటు ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించడం చేద్దామని భావిస్తున్నట్టు తెలిపారు. నా నియోజకవర్గంలో సక్సెస్ అయిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అదే మోడల్‌లో శానిటేషన్ చేయిస్తామన్నారు. ప్రజలను, పోలీసులను, అధికారులను ఇబ్బందులు పెట్టి విజయయాత్ర చేయాలనుకోలేదని, పనిచేసిన తర్వాతే తనకు విజయయాత్ర అని స్పష్టం చేశారు. పనిచేసి మన్ననలు పొందితేనే తనకు ఆనందం. అప్పుడే నేను ఎమ్మెల్యేను అయ్యాను అన్న ఆనందం కలుగుతుందని తెలిపారు. ఎక్స్‌పర్ట్‌లను తీసుకువచ్చి పిఠాపురానికి మేలు చేసే దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో 40,765 మందికి పింఛన్ల రూపేణా రూ.27.34 కోట్లు అందజేస్తున్నామని చెప్పారు. వారం విడిచి వారం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరు ఇక్కడే ఉండి సమస్యలు పరిష్కరిస్తారని చెప్పినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. దివ్యాంగులకు 40 శాతం వికలాంగత్వం ఉంటేనే పింఛన్ అందుతోందని, ఇందులోనూ ఎన్నో సమస్యలు ఉన్నాయని, 90 శాతం ఉన్నవారికి సదరంలో సర్టిఫికెట్ రావడం లేదని, ఇటువంటి వాటిని సరిచేస్తామని ప్రకటించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తన మొదటి పర్యటన ఇదని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఎన్నికల్లో గెలిచి ఊరేగింపు చేసుకోవడం నాకు ఇష్టం లేదు. పనిలోకి వెళ్లాలనుకున్నా. పింఛన్లు అందించి కృతజ్ఞతలు చెబుదామని భావించానని చెప్పారు. భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజల కోసం తక్కువ మాటలు చెప్పి ఎక్కువ పనిచేయాలన్నది నా భావన అన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నాం. ఇది అసలైన ఛాలెంజ్ అని తెలిపారు. దివ్యాంగుల సమస్యలను జనవాణిలో విన్నా.. నిజంగా గత ప్రభుత్వంలో అన్యాయానికి గురైన వారు ఉన్నారంటే దివ్యాంగులేనని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తూ అందరిలో ఉన్న ప్రతిభ, సమర్థతను వెలికితీస్తామని తెలిపారు. అంతకుముందు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు సగిల షాన్‌మోహన్,ఎస్పీ సతీష్‌కుమార్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, బుర్రా కృష్ణంరాజు పాల్గొన్నారు.


వెల్‌కమ్ సార్ : డిప్యూటీ సీఎం పవన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి


వీళ్ల భవిష్యత్ చూస్తున్నా : గొల్లప్రోలు సభలో పవన్

ప్రజలకు ఆంక్షలు పెట్టవద్దు...

ప్రజల దగ్గరకు వచ్చినప్పుడు దయచేసి రక్షణ పేరుతో ఆంక్షలు పెట్టవద్దని.. గతంలో జనవాణి, ఇతర సందర్భాల్లో ప్రజలను ఎలా కలుసుకునే వాడినో అలా గే కలుసుకోనివ్వాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పోలీసు యంత్రాంగానికి సూచించారు. సీఎం, డిప్యూటీ సీఎం అని నేనెప్పుడూ అనుకోలేదు. కష్టపడే వ్యక్తిగా ఈ స్థానంలో ఈ రోజున కూర్చున్నాను. మీరు వేసి ప్రతి ఓటు సరైన వ్యక్తికి, కూటమికి వేశామని గర్వపడే విధంగా తన పనితీరు ఉంటుందని పవన్‌కల్యాణ్ తెలిపారు. చక్రి అనే బాలుడిని వేదిక మీదకు పిలిపించుకుని ఇటువంటి బిడ్డల భవిష్యత్తు కోసం పనిచేస్తానని చెప్పారు. నా బిడ్డలు కోసం ఎంత తపన పడతానో తెలియదు కానీ ఇటువంటి బిడ్డల కోసం ఈ తరమే కాదు రానున్న రెండు తరాల కోసం పనిచేస్తానని తెలిపారు. ఇది టీడీపీ లీడ్ చేసే ప్రభుత్వం, జనసేన వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వం, ప్రధాని మోదీ, బీజేపీ పెద్దలు ఆశీస్సులు ఉన్న ప్రభుత్వమని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలు రుణం తీర్చుకుంటానని పవన్ తెలిపారు.నియోజకవర్గంలో స్థలం కోసం చూస్తున్నానని.. సొంతింటిని కట్టుకుంటానని ప్రకటించారు. మీ అందరి మధ్యే ఉంటానని చెప్పారు.




మీకు అండగా : గొల్లప్రోలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న పవన్

మాకు చంద్రబాబు పెద్దకొడుకే..

చేనేత కార్మికుల కుటుంబాలకు చంద్రబాబు పెద్దకొడుకు.. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచారు. ఒకే సారి రూ.7 వేలు తీసుకోవడం సంతోషంగా ఉంది. **- కొప్పుల సత్యవతి, గుత్తి సూర్యకాంతం, చేనేత కార్మికులు, దుళ్ల, కడియం మండలం**

రూ.15 వేల పింఛను.. రుణపడి ఉంటా..

మంచానికి పరిమితమై ఇంటికి భారంగా బతుకుతున్న నాకు చంద్రన్న జీవితంపై ఆశను కల్పించారు. నెలకు రూ.15 వేల పింఛను అందిస్తున్నారు.చంద్రన్నకు రుణపడి ఉంటా.
- గొలుగూరి నాగిరెడ్డి, లబ్ధిదారుడు, అనపర్తి

మంచం దిగలేనన్న బాధ తప్ప ఇంకేం లేదు



నాకు రూ.15 వేల పింఛను ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. నేను మంచం దిగలేను. పెరాలిస్ వచ్చి కాళ్లు, చేతులు పడిపోగా తర్వాత నడుం జారిపోయింది. మందులకు బోలెడంత ఖర్చవుతోంది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పుణ్యమాని ఈనెల నుంచి రూ.15 వేలు వస్తోంది. నాకు ఇంక లేవలేనన్న దిగులు తప్ప ఇంకే విధమైన దిగులు లేదు.
- వడ్లమూరు నర్సమ్మ, చినకొండేపూడి, సీతానగరం మండలం

ఆసుపత్రికి వెళ్లి..పింఛను అందజేత



చాగల్లు మండలం నెలటూరుకు చెందిన అంగారపు సురేష్ తీవ్ర అనారోగ్యంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక సచివాలయ సిబ్బంది పింఛను అందజేయడానికి ఇంటికెళితే విషయం తెలిసింది. దీంతో సచివాలయ మహిళ సంరక్షణ కార్యదర్శి దీప్తి ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు.

అర్జీలపై విచారణ చేపట్టి 24 గంటల్లో నివేదిక ఇవ్వండి

ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 1 : ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై తగిన విచారణ చేపట్టి 24 గంటల్లో ఆ సమస్యల వాస్తవ స్థితిని వివరిస్తూ తనకు నివేదిక అందజేయాలని కలెక్టర్ పి ప్రశాంతి అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వచ్చిన 80 అర్జీలను కలెక్టర్ ప్రశాంతి, జేసీ తేజ్ భరత్ స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.ఈ ప్రక్రియపై సంబంధిత జిల్లా అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన 80 అర్జీలలో ఆన్‌లైన్‌లో 77 ,ఆఫ్‌లైన్‌లో 3 వచ్చాయని తెలిపారు. నిడదవోలు డివిజన్ పరిధిలోని నరసాపురం నీటిపారుదల శాఖ సబ్‌డివిజన్ సిద్ధాంతం సెక్షన్‌లో అవుట్ సోర్సింగ్‌లో లస్కర్‌గా పనిచేసిన చిట్టాల శేషునాయుడు తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించారని నిరసన తెలిపారు. 68 ఏళ్ళ రిటైర్డ్ ఏసీ అసిస్టెంట్ జగన్నాథరావుకు ఈ ఉద్యోగం ఇచ్చి ఈఈ దక్షిణ మూర్తి తనకు అన్యాయం చేశాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. రూ70వేలు లంచం తీసుకున్నారని నా ఉద్యోగం పోవడంతో నేను నా భార్య పిల్లలు రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు 10నెలల జీతం పెండింగ్ ఉందని చెప్పాడు. ఇప్పటికి 6 సార్లు కలెక్టరేట్‌లో అర్జీపెట్టుకున్నానని ఈసారైనా న్యాయం చేయాలని వేడుకున్నాడు. రూరల్ మండలం ఎర్రగొండ సుగుణనగర్ ప్రాంతానికి చెందిన సత్యవేణి తమ ప్రాంతంలో వీధి దీపాలు, డ్రైనేజీలు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెత్తఎక్కడపడితే అక్కడ ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికి ఐదు సార్లు అర్జీ పెట్టినా ఎవ్వరు పట్టించుకోలేదని చెప్పారు. శ్రీచైతన్య టెక్నో, భాష్యం తదితర స్కూల్స్‌లో ప్రభుత్వ కోటాతో ఫ్రీసీటు పొందిన విద్యార్థులు తల్లిదండ్రులు కలెక్టర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. తమ పిల్లలను చేర్చుకున్న ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ప్రభుత్వ జీవోకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఫీజులు యథావిధిగా చెల్లించమని చెబుతున్నారని వాపోయారు. ప్రభుత్వ కోటాలో ఫ్రీ సీటు పొందిన మా పిల్లలను స్కూళ్ళలో మిగిలిన పిల్లలతో కలపకుండా వేరొక గదిలో కూర్చోపెట్టి వేరుగా ట్రీట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు ప్రభుత్వ జీవో ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాతేరుకు చెందిన ధర్మలింగం గ్రామంలో నూతన ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని అర్జీ పెట్టుకున్నాడు. రాజానగరం మండలం చక్రద్వార బంధం గ్రామానికి చెందిన బోడెం మంగతాయారు తన గ్రామంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసే చౌకధరల దుకాణాన్ని బినామీదారులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ అర్జీలను పరిశీలన చేసి 24గంటల్లో నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


ప్రజా పరిష్కార వేదికలో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

ఎస్పీ గ్రీవెన్స్‌కి 20 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం(మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ జగదీశ్ స్వయంగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. జూమ్ కాన్ఫరెన్స్ విధానంలో ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాట ఇతర కేసులకు సంబంధించి మొత్తం 20 అర్జీలను ఎస్పీ స్వీకరించి పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే విధంగా చట్ట పరిధిలో వాటిని త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

పింఛన్‌దారుల ఆనందం

వృద్ధుల కష్టాలు చంద్రన్నకు తెలుసు



వృద్ధాప్యం అనుభవిస్తూ పండుటాకుల్లా జీవిస్తున్న మా కష్టాలు చంద్రన్నకు తెలిసినట్టుగా ఎవరికీ తెలియవు. ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటానని ఎవరూ పెంచనివిధంగా పింఛన్లు పెంచిన చంద్రన్నను గతంలో మోసగించాం. తప్పు తెలుకున్నాం. నాలుగు వేలకు పెంచిన పింఛనుతో ఆనందంగా జీవిస్తాం. పండుటాకులకు ఇంతకన్నా ఏంకావాలి చెప్పండి.

- సబ్బెళ్ళ సుబ్బయ్యమ్మ, లబ్ధిదారు, అనపర్తి

చేదోడు అయ్యింది..



చంద్రబాబు పెంచిన పింఛను నాకు ఎంతో చేదోడు అయ్యింది. నాకు మూడేళ్ల కిందట ప్రమాదంలో రెండు కాళ్ల దెబ్బతిని ఆపరేషన్లు అయ్యాయి. ఇప్పటికీ ఏ పనీ చేయలేకపోతున్నా. నాకు ఈ పింఛనే ఆధారం.

తుట్టా లక్ష్మీనారాయణ, దివ్యాంగుడు, బిక్కవోలు

సంతోషంగా ఉంది..



చాలా సంతోషంగా ఉంది. ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబునాయుడు పింఛను పెంచారు. ఏప్రిల్ నుంచి పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు 3 వేలు కూడా కలిపి రూ.7 వేలు పింఛను తీసుకోవడం ఆనందంగా ఉంది.

వేళంగి గౌరమ్మ, కడియం

బాబుకు కృతజ్ఞతలు



పింఛను రూ.3 వేల నుంచి నాలుగు వేలకు పెంచినందుకు ఎంతో ఆనందంగా ఉంది. దీంతోపాటు ఏప్రిల్ నెల నుంచే పెంచిన మొత్తాన్ని కలిపి మొత్తం రూ.7 వేలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. చంద్రబాబుకు కృతజ్ఞతలు.

బత్తిన మార్తమ్మ, వడిశలేరు, రంగంపేట మండలం

చేయూత అందింది



చాలా ఆనందంగా ఉంది. నాకు కాలుకు ఇబ్బంది వచ్చి ఆపరేషన్ చేయించుకున్నా. అప్పులపాలయ్యాం. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ప్రయత్నించినా గత ప్రభుత్వంలో మాకు ఏ పని అవ్వలేదు. ఇప్పుడు పింఛను పెంచి ఇవ్వడంతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం వచ్చింది. చంద్రబాబు అండగా నిలబడ్డారు..

- జొన్నాడ సూరమ్మ, సీతానగరం

- అనపర్తి/ బిక్కవోలు/కడియం/రంగంపేట/సీతానగరం


నిత్యాన్నదానానికి రూ.లక్ష



విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, జూలై 1: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం రామచంద్రపురానికి చెందిన కొత్తపల్లి రామకృష్ణ, వరలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

చీఫ్ ఇంజనీర్‌గా వాసుదేవరావు



మోతుగూడెం, జూలై 1: సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్‌గా వాసుదేవరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంప్లెక్సు పరిధిలోని మూడు జల విద్యుత్ కేంద్రాల ఇంజనీర్లు నూతన సీఈ వాసుదేవరావుకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జెన్‌కో ఉద్యోగ సంఘాల నాయకులు పలువురు సీఈని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఇంజనీర్లతో సమావేశమై కాంప్లెక్సు పరిధిలోని విద్యుత్ ఉత్పత్తి, యూనిట్ల పనితీరుపై నీటి నిల్వలు తదితర అంశాలపై చర్చించారు.

ఐటీఐలో ప్రవేశానికి ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 1: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో, జగ్గంపేటలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి ఈనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు.

4న ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 1: కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 4న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంజీవీ వర్మ తెలిపారు. ఐటీఐ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు 350 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వివరించారు.

డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం



గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



సత్యనారాయణస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న రత్నగిరి ఈవో, చైర్మన్

పోలీసుల గౌరవ వందనం

పూల కార్పెట్‌పై నడిచేందుకు పవన్ నిరాకరణ

అభినందనలు తెలిపిన కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, జూలై 1: రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి కాకినాడ జిల్లాకు వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు సోమవారం ఘనస్వాగతం లభించింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి నేరుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో గల తన నివాసానికి చేరుకున్నారు. అక్కడ పోలీసులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పవన్‌కు జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టరు రామసుందరరెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తదితరులు స్వాగతం పలికారు. అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో రామచంద్రమోహన్‌లు పవన్‌ను శేషవస్త్రాలతో సత్కరించి సత్యదేవుని ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. పవన్ వస్తున్నారనే సమాచారం తెలియడంతో భారీగా జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. కాగా పవన్ తన నివాసంలోకి వెళ్లే దారిలో గులాబి పువ్వులను కార్పెట్‌లా పరిచారు. దానిపై నడిచేందుకు పవన్ సున్నితంగా తిరస్కరించి పక్క నుంచి నడిచి నివాసంలోకి వెళ్లారు. చేబ్రోలు నివాసం వద్ద పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ఆయన తనయుడు గిరీష్ పవన్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వర్మను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాలు నుంచి తరలివచ్చే ప్రజలు ఇచ్చే వినతులను స్వీకరించేందుకు చేబ్రోలు నివాసం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. జనవాణి పేరుతో వినతులు స్వీకరించి వారి సమస్యలను కౌంటర్‌లోని సిబ్బంది అడిగి తెలుసుకుంటున్నారు.

విమానాశ్రయంలో ఘన స్వాగతం



పవన్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ జగదీశ్ తదితరులు

కోరుకొండ, జూలై1: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన సందర్భంలో ఆయనకు విమానాశ్రయం వద్ద మంత్రి దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మెల్యేలు ఘనంగా స్వాగతం పలికారు. తూర్పుగోదావరి జిల్లా కొత్త కలెక్టర్ పి.ప్రశాంతి పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహూకరించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి కూడా పవన్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పిఠాపురం బయల్దేరి వెళ్లారు.



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తా

మీరిచ్చిన బలం రాష్ట్రమంతా తిరిగేలా చేసింది

జనసైనికులు, వీరమహిళల సమావేశంలో జనసేనాని పవన్‌కల్యాణ్

పిఠాపురం/గొల్లప్రోలు, జూలై 1: ఆఖరి శ్వాస వరకూ ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తానని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ ఫంక్షన్ హాలులో సోమవారం సాయంత్రం జరిగిన పిఠాపురం నియోజకవర్గ జనసైనికులు, వీరమహిళల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. సుమారు గంటన్నర పాటు వారితో మాట్లాడారు. పిఠాపురాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడదామన్నారు. పిఠాపురంలో మీరిచ్చిన బలం రాష్ట్రం అంతా తిరిగేలా చేసిందని చెప్పారు. తనకు పదవులపై వ్యామోహం లేదన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో పిఠాపురం తనను గెలిపిస్తుందా లేదా, అన్ని స్థానాలు గెలుస్తామా లేదా అని ఆలోచన ఉండేది కాని మనస్సులో మాత్రం మనం ఘన విజయం సాధించబోతున్నామని ధీమా ఉందని అన్నారు. అందుకే టీవీలు చూడలేదు. గెలుపు తర్వాత వచ్చి చెవిలో చెప్పమన్నా అని వివరించారు. గెలిచిన తర్వాత నియోజకవర్గానికి వచ్చేద్దాం. తిరిగేద్దాం. గజమాలలు వేయించుకుందామనే ఉబలాటం కలిగిందని, అయితే మనస్సు మాత్రం ఇంత ఘనమైన విజయం అందించిన వారి కోసం ఒక కూలీలా కష్టపడి పనిచేసి గతంలో ఎవ్వరు చేయని విధంగా పిఠాపురాన్ని అభివృద్ధి చేసి చూపించాలని సూచించిందని తెలిపారు. పిఠాపురానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చి ప్రపంచదేశాలన్ని ఇటువైపు చూసేలా చేస్తానని చెప్పారు. పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. తన శాఖలపై ప్రజలు నుంచి అభిప్రాయాలు కోరితే ఒక్క పిఠాపురం నియోజకవర్గం నుంచే 1424 ఇన్‌పుట్స్ వచ్చాయని చెప్పారు. ఇందులో దుర్గాడ, ఉప్పాడ తదితర గ్రామాలు నుంచి విలువైన సూచనలు వచ్చాయని తెలిపారు. తన కోసం, జనసేన విజయం కోసం దేశ, విదేశాలు నుంచి జనసైనికులు, వీరమహిళలు వచ్చి పనిచేశారని, ఒకరైతే ప్రాణాలు కోల్పోయారని పవన్ తెలిపారు. ఆస్ట్రేలియా నుంచి ఒకరు వచ్చి ఆరునెలలు ఇక్కడ పనిచేశారని, బజ్జీలు అమ్ముకనే వ్యక్తి తన సంపాదనలో కొంతభాగాన్ని జనసేనకు విరాళం ఇచ్చారని, ఎండలో మలమల మాడుతూ ప్రచారం నిర్వహించారని, ఇవన్ని గుర్తుకు వస్తుంటే కన్నీళ్లు తిరుగుతున్నాయని, ఏమిచ్చి వీరి రుణం తీర్చుకోగలనని ఆయన అన్నారు.

పిఠాపురాన్ని వదిలి ఎక్కడకీ వెళ్లను

పిఠాపురాన్ని వదలి తాను ఎక్కడకు వెళ్లను అని పవన్ స్పష్టం చేశారు. పిఠాపురంలోనే స్థలం తీసుకుని ఇల్లు కట్టుకుంటానని తెలిపారు. మతాల సామరస్యతకు పిఠాపురం ఒక చిహ్నమని చెప్పారు. ఉదయం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి, సాయంత్రం జరిగిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళల సమావేశానికి తరలివచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించిన గొల్లప్రోలు జనసేన సేవా సమితి ప్రతినిధులకు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. సుమారు 10వేల మందికి భోజనాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సమీక్షలతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బిజీబిజీ

టూర్ షెడ్యూల్ విడుదల

గొల్లప్రోలు రూరల్, జూలై 1: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం జరిపే టూర్ షెడ్యూల్‌ను ప్రకటించారు. 2వ తేదీ ఉదయం 9.30 గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసం నుంచి కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరుతారు. కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలు నుంచి 11గంటల వరకూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో, 11.30 నుంచి 12 గంటల వరకూ రోడ్ కనెక్టవిటీపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకూ అటవీశాఖ అధికారులతో, ఒంటి గంట నుంచి 2 గంటల వరకూ రీజనల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. రాజమహేంద్రవరంలో నూతనంగా రీజనల్ సైన్స్ సెంటర్ ఏర్పాటుపై అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం అనంతరం జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశమవుతారు. రాత్రికి చేబ్రోలులోనే బసచేస్తారు.

కేన్సర్ స్ర్కీనింగ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలి

ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



అమ్మ భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

రాజానగరం/రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 1: కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షను ఆరోగ్యశ్రీలో చేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని న్యూయార్క్‌లో కేన్సర్ అధ్యయన కేంద్రాన్ని నిర్వహిస్తున్న ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు కోరారు. డాక్టర్స్ డే సందర్భంగా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిని, రాజమహేంద్రవరంలోని కేన్సర్ ఆసుపత్రిని ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో నెలకొల్పిన అంతర్జాతీయ ఫుడ్ సర్వీసుల సంస్థ సొడెక్సో శాఖాహార భోజన పథకాన్ని, కొత్తగా నెలకొల్పిన, అప్ గ్రేడ్ చేసిన మూడు కేన్సర్ చికిత్స యూనిట్లను డాక్టర్ నోరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ నిర్మూలన అంటే జబ్బు వచ్చాక తగ్గించుకోవడం మాత్రమే కాదని ప్రజలు కేన్సర్‌పై అవగాహన పెంచుకోవడం, ఎప్పటికప్పుడు స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవమే కేన్సర్ నిర్మూలనని చెప్పారు. కేన్సర్‌ను సకాలంలో గుర్తించి ఎప్పటికప్పుడు ట్రీట్మెంట్ తీసుకుంటే 98 శాతం కేసుల్లో ప్రాణాపాయం నుంచి బయటపడి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ జీఎస్ఎల్ గ్రూపు సంస్థలు సబ్సిడీ పథకాన్ని ప్రారంభిస్తూ, జీఎస్ఎల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు రూ.10కే భోజనం అందిస్తామన్నారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా రెండు దశాబ్దాలుగా జీఎస్ఎల్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 100 మంది వైద్యులు, ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బందిని ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ తరుణ్ గోగినేని, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పీబీ ఆనందరావు, సీఎస్ఎల్ సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, గన్ని కృష్ణ, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ సమస్యలపై 57 అర్జీలు

రంపచోడవరం జూలై 1: ప్రజా సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఐటీడీఏ ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఐటీడీఏ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం అధికారులు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 57 అర్జీలు రాగా కొన్ని సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత శాఖలకు పంపించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏడీఎంఅండ్‌హెచ్‌వో శిరీష, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

తాళ్లరేవు, జూలై 1: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి ఇందిరమ్మకాలనీకు చెందిన పిల్లి వినయ్(20) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు కోరింగ ఎస్ఐ రవికుమార్ సోమవారం తెలిపారు. ఇందిరమ్మకాలనీలో వినయ్ చిన్నాన్న ఇంటి నిర్మాణంలో భాగంగా వాటర్ డ్రమ్‌ను నింపేందుకు విద్యుత్ మోటారును సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తూ పిల్లి వినయ్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. హుటాహుటిన వినయ్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లగా చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మన్యం ప్రాంతంలోని పోస్టులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

మెగా డీఎస్సీతో స్థానిక అభ్యర్థులకు అన్యాయం

ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేత మురళి

చింతూరు, జూలై 1: మన్యం ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు గాను స్థానిక అభ్యర్థులకు మాత్రమే వర్తించే విధంగా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి డిమాండ్ చేశారు. సోమవారం చింతూరులో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీలో మన్యం పోస్టుల భర్తీని కూడా కలిపేయడం వల్ల స్థానిక డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. నాయకులు పులి వీరయ్య, పైదా ముత్తయ్య, తుర్రం రమేష్, సోడె సత్యనారాయణ పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారు..

రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం

దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళిక

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

పెరవలి, జూలై 1: గత ఐదేళ్లలో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా మారిందని, పోలవరం ప్రాజెక్టు నాశనం చేయడంతో పాటు అమరావతిని కూడా రూపురేఖలు మార్చి వేశారని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడి రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. పింఛన్ల పంపిణీ నిమిత్తం పెరవలి మండలం తీపర్రు వచ్చిన ఆయన కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఖజానాను జగన్ ప్రభుత్వం ఖాళీ చేయడంతో ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే కష్టతరంగా మారిందన్నారు. రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కడియం నర్సరీలను అభివృద్ధి చేయడం ద్వారా టూరిజం, వివిధ ఆలయాలను అభివృద్ధి చేయడం ద్వారా టెంపుల్ టూరిజం, ప్రకృతి ప్రదేశాలు అభివృద్ధి చేయడం ద్వారా హెరిటేజ్ టూరిజం అభివృద్ధి చేస్తామని దుర్గేష్ పేర్కొన్నారు. విశాఖపట్టణం, తిరుపతి పరిసర ప్రాంతాల్లో టూరిజం బాగా అభివృద్ధి చెందుతోందని, రాజమహేంద్రవరంలో హేవలాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేసి పిచ్చుకలలంక పరిసర ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని నామినేటెడ్ పోస్టులన్నీ రద్దు చేశారని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులను టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి సమన్వయంతో ఎంపిక చేసి ఆ పోస్టుల్లో నియమిస్తామని, దానికి ఇంకా సమయం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, అతికాల శ్రీను, పిప్పర రవి, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, మొగళ్లపు సీతారాం, ప్రత్తిపాటి వీరభద్రకుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

యానాం, జూలై 1: స్థానిక సీగల్స్‌లో సోమవారం యానాం మహాత్మాగాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఎస్‌టీపీపీ జూనియర్ కళాశాలలో 1978-81లో పది, ఇంటర్ చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఇటీవల వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పూర్వ విద్యార్థులు అనిమిల్లి సత్యనారాయణ, వేమూరి విజయ్‌కుమార్, దంగేటి త్రిమూర్తులు, గొకవరపు వీరేశ్వరరావులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. యానాం పబ్లిక్ స్కూల్‌లో పేద విద్యార్థిని ఎస్.అమృతవర్షిణికి రూ.10వేలు ఫీజులు కోసం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తొత్తరమూడి వెంకటేశ్వరరావు (విశ్రాంతి ఎస్పీ సీఐఎఫ్ఎస్), గూటం శివగణేష్ (విశ్రాంతి సీఐ), పోలిమారి సత్యనారాయణ(విశ్రాంతి మేనేజర్ ఇండియన్ బ్యాంక్), కమిడి విజయ్‌కుమార్, కముజు సూరిబాబు(ప్రముఖ న్యాయవాది) పాల్గొన్నారు.

రోడ్‌కంరైలు బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్





బస్సును తోస్తున్న ప్రయాణికులు

కొవ్వూరు, జూలై 1: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం 9-30 గంటల నుంచి 11 గంటల మధ్యలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు టోల్ గేట్ వద్ద గడ్డర్ల సమీపంలో ఏలూరు డిపో బస్సు మొరాయించింది. అదే సమయంలో కొవ్వూరు వైపు బ్రిడ్జిపై మలుపులో మరో బస్సు మొరాయించి నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న రాజమహేంద్రవరం, కొవ్వూరు పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మొరాయించిన బస్సులను ప్రయాణికులు పక్కకు నెట్టారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి



కోటనందూరు, జూలై 1: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కేఈ చిన్నయ్యపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం...అనకాపల్లి జిల్లా నాతవరం మండలం వీకే గూడెం గ్రామానికి చెందిన కొమ్ము సూర్యనారాయణ (45) రౌతులపూడి మండలం రాజవరం నుంచి మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తుండగా మరో మోటార్ బైక్‌పై కోటనందూరు మండలం అల్లిపూడి నుంచి కేఈ చిన్నయ్యపాలెం వైపు వెళుతున్న మోటార్‌బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో మోటార్ బైక్‌పై ఉన్న నేలపాటి అప్పలకొండ, మార్తి రాజుకు గాయాలు కావడంతో 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని స్థానిక పోలీసులు తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

21లక్షల ఎకరాల వీఎస్ఎస్ భూములు గ్రామ సభలకు అప్పగించాలి : ఆదివాసీ మహాసభ

రాజమహేంద్రవరం సిటీ, జూలై1: రాష్ట్రంలో 21 లక్షల ఎకరాల వనసంరక్షణ సమితి (వీఎస్ఎస్) భూములు ఉన్నాయని, వాటిని అటవీ హక్కుల చట్టం ప్రకారం గ్రామ సభలకు అప్పగించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారులు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలకు గతంలో వీఎస్ఎస్ భూములు గ్రామసభలకు అప్పగించాలని ఆదేశాలిచ్చిందని, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి, పవన్ స్పందించి ఈ భూములను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏజెన్సీ సమాచారం

పండుగలా పింఛన్ల పంపిణీ

పలు గ్రామాల్లో పింఛన్లు అందించిన ఎమ్మెల్యే శిరీషాదేవి

. రంపచోడవరం జూలై 1: రంపచోడవరం నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమం పండుగలా జరిగింది. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పింఛన్ అందించారు. 11 మండలాల్లో 90 గ్రామ సచివాలయాల పరిధిలోని 30,076 మంది లబ్ధిదారులకు రూ.20.46 కోట్లను అధికారులు పంపిణీ చేయాల్సి ఉండగా అత్యధిక శాతం పంపిణీ పూర్తయింది. రంపచోడవరం ఎర్రంరెడ్డి నగర్‌లో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు. ఎంపీడీవో హరికృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు అడబాల బాపిరాజు, సలాది బాపిరాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు



పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రాజవొమ్మంగి జూలై 1: రాజవొమ్మంగి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీషాదేవి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ అందించారు. లబ్బర్తి గ్రామంలో సోమవారం వృద్ధులకు రూ.7 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల చొప్పున పంపిణీ చేశారు. గ్రామంలో వృద్ధ దంపతులకు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ పాదాభివందనం చేసి పింఛన్ అందించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎన్టీఆర్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.1000 పెంచేందుకు ఐదేళ్లు పట్టిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి వేయి పెంచి అందించిందన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన మాట నిలబెట్టుకుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, ఎంపీడీవో యాదగిరేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతారావు పాల్గొన్నారు.

నేతల చిత్రపటాలకు పాలాభిషేకం

చింతూరు, జూలై 1: సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చిత్రపటాలకు చింతూరు మండల కూటమి నేతలు, పింఛన్ లబ్ధిదారులు సోమవారం పాలాభిషేకం చేశారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన పింఛన్ సొమ్ములను నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు మడివి రాజు, టీడీపీ నాయకులు రామారావు చౌదరి, ఎం. వెంకటేశ్వరరావు, సురేష్‌చౌదరి రియాజ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా పింఛన్ల పంపిణీ

వరరామచంద్రాపురం, జూలై 1: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అట్టహాసంగా ప్రారంభించారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం ఏర్పడింది. జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, టీడీపీ నాయకులు, అధికారులు రహదారి సౌకర్యం లేని మారుమూల గ్రామాలైన కొండేపూడి, కొల్లూరు, గొందూరు గ్రామాల్లో కొండరెడ్లకు పడవపై గోదావరి నది గుండా వెళ్లి పింఛన్లు పంపిణీ చేసారు. మండలంలోని శ్రీరామగిరి గ్రామ పంచాయతీలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆచంటి శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, మండల నాయకులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, మండల నాయకులు బొర్ర నరేష్‌కుమార్, బీరక సూర్యప్రకాష్‌రావు, బురక కన్నారావు, ముత్యాల చంద్రశేఖర్, బొర్ర నరసింహారావు, పెందుర్తి సుదర్శన్, గొంది చంద్రయ్య, జంగాల మల్లికార్జున్, ముత్యాల సిద్ధు, ఎస్.రాజు, పంచాయతీల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వృద్ధులకు పింఛన్లు

ఎటపాక, జూలై1: ఆయుర్వేద డాక్టర్, టీడీపీ నాయకుడు జమాల్‌ఖాన్, టీడీపీ సీనియర్ నాయకుడు కిలారు వెంకన్న, అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సోమవారం పింఛన్లు అందించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ రావిమాధవరావు, టీడీపీ నాయకులు వల్లభనేని చందు, నలజాల శ్రీకాంత్, ఏలూరి వెంకన్న, బొల్లా పుల్లయ్య, పూసం రాఘవయ్య మోసం రాజులు, బాచినేని మల్లేశ్వరరావు, పూరేటి వెంకటేశ్వరరావు, కణితి మధు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

అడ్డతీగల, జూలై 1: అడ్డతీగల అల్లూరి సీతారామరాజు కాలనీ, వాల్మీకి నగర్, పాపంపేట గ్రామాల్లో ఎమ్మెల్యే శిరీషాదేవి సోమవారం పింఛన్లు అందించారు. అడ్డతీగలలో వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో ఎం.విజయ రంగారావు చెప్పారు.

నేతల ఫొటోలకు పాలాభిషేకం

మోతుగూడెం, జూలై1: చింతూరు మండలం మోతుగూడెంలో పింఛన్ల పండుగ ఘనంగా జరిగింది. పెంచిన రూ.వేయితో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలిపి మొత్తం రూ.7వేలను వృద్ధులకు అందించారు. మోతుగూడెం పరిధిలో మోతుగూడెం, పొల్లూరు, ఫోర్‌బై, ఇంతలూరు వాగు, ఒడియా క్యాంప్, ఎంసీడీ గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించారు. దివ్యాంగులకు రూ.6 వేలు అందించారు. మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోలకు పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డొంకరాయిలో..

డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది. సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. కూటమి నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన అనంతరం మంగంపాడు, పాలగెడ్డ, బొడ్డు మామిడి గ్రామాల్లో పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జయదాస్, వార్డు మెంబర్ నీలాపు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గంగిరెడ్ల గురుమూర్తి, టీడీపీ నాయకులు మావూరి సత్యనారాయణ, ప్రేమ్‌కిరణ్, అనిల్, రాజు, వేణు, తాళి, జనసేన నాయకులు కీముడు మూర్తి పాల్గొన్నారు.

కూటమి నేతల ఆధ్వర్యంలో..

దేవీపట్నం, జూలై 1: మండలంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమయ్యింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజం రాజామణి, అన్ని గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

విజయవంతంగా పింఛన్ల పంపిణీ

వై.రామవరం, జూలై 1: మండలంలో పలు చోట్ల సోమవారం పింఛన్‌దారులు, టీడీపీ శ్రేణులు సీఎం చంద్రబాబు ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేశారు. టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. వై.రామవరంలో టీడీపీ నాయకులు గొర్లె శ్రీకాంత్, మడకం రామలక్ష్మి ఆధ్వర్యంలో, బండిగడ్డలో సిద్దనాతి శ్రీనివాసరావు, పతివాడ వెంకటేశ్వరరావు, వల్లాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో, దాలిపాడులో టీడీపీ ప్రధాన కార్యదర్శి వీకా నర్సన్నదొర ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు జరిగాయి. వై.రామవరం మండలంలో సోమవారం 77.72 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. 3371 పింఛన్లకు గాను 2620 మందికి పింఛన్లు ఇచ్చామన్నారు. లోతట్టు గ్రామాల్లో సిగ్నల్ సమస్యలతో లబ్ధిదారుల వేలిముద్రలు పడకపోవడంతో పింఛన్లు ఇవ్వలేదని మంగళవారం వాటిని పూర్తిచేస్తామన్నారు.





రాజమహేంద్రవరంలో పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి.. వేమగిరిలో పింఛను పంపిణీ చేస్తున్న జేసీ తేజ్‌భరత్

పండగలా పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై1: కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టాక పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సోమవారం జిల్లా అంతటా ఓ పండుగలా సాగింది. రాజమహేంద్రవరంలో ఉదయం 6 గంటలకు రాజమహేంద్రవరం వీఎల్ పురం పార్కు వద్ద లబ్ధిదారులకు ఏకమొత్తంగా రూ.7 వేలను కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీను, బీజేపీ నగర ఇన్‌చార్జి యెనుముల రంగబాబులు కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ విడతలవారీగా కాకుండా పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛను ఒకేసారి అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్వయంగా 1,50,49,45,22,23,32,13 డివిజన్లలో పింఛన్లు పంపిణీ చేశారు. కాగా పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు 13వ డివిజన్ ఇన్‌చార్జి కప్పల వెలుగుకుమారి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ల చిత్రపటానికి పాలభిషేకం చేశారు.

పెన్షన్లు పంపిణీ విజయవంతం : జేసీ తేజ్‌భరత్

కడియం, జూలై 1: వలంటీర్లు లేకుండానే సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నట్టు జేసీ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. వేమగిరి సచివాలయం1 పరిధిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జేసీ తేజ్‌భరత్ పరిశీలించారు. నాలుగురోజుల ముందు నుంచి ప్రణాళికలు వేయడంతో పెన్షన్ల పంపిణీ సులభతరం అయిందన్నారు. సోమవారం ఉదయం నుంచి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టామని, మధ్యలో కొద్దిసేపు సర్వర్ ఆగిందని, తరువాత యథావిధిగా సర్వర్ పనిచేయడంతో పంపిణీ వేగవంతం అయిందన్నారు. ఎంపీడీవో జి రాజ్‌మనోజ్, తహశీల్దారు బి.రమాదేవి, నాయకులు వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, సూరపురెడ్డి జానకీరామ్, దంగేటి సత్తిబాబు, గుత్తుల హరిప్రసాద్‌లు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం : ఎమ్మెల్యే గోరంట్ల

కడియం/రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం, జూలై1: చంద్రబాబుతోనే పేద ప్రజల జీవితాల్లో వెలుగులు అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలం, బొమ్మూరు, ధవళేశ్వరంలలో జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ జరుగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే ఇచ్చిన మాట ప్రకా రం హామీని నెరవేరుస్తున్న ఏకైక సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. అలాగే కడియంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, పంతం గణపతి, కలిదిండి గోవిందు, ఆకుల శ్రీధర్, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వరగోగుల వెంకటేశ్వరరావు, ఆదిమూలం సాయి, షేక్ సిద్దయ్య, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ధవళేశ్వరంలోని బోటు ఆఫీసు వీధిలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే గోరంట్ల ఫించన్లు అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్ చేసి చం ద్రబాబు చిత్రపటాన్ని పాలతో అభిషేకించారు. టీడీపీ పార్టీ పట్టణాధ్యక్షుడు పందూరి అప్పారావు, సీనియర్ నాయకులు పిన్నంటి ఏకబాబు, ఆళ్ల ఆనందరావు, యర్రమోతు ధర్మరాజు, జనసేన నాయకులు యడ్ల మహేష్, బీర్రాప్రకాష్, అల్లంపల్లి ముత్యాలు, బీజేపీ నాయకులు గుర్రాల వెంకట్రావు, ఒంటెద్దుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట/బిక్కవోలు, జూలై 1: మండల కేంద్రమైన రంగంపేటలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించి ఇంటింటికి వెళ్లి పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంపుదల చేశారన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పింఛన్‌దారులు పాలభిషేకం చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నాయకులు నీలపాల త్రిమూర్తులు, మండల అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరాం, జనసేన మండలాధ్యక్షుడు గిరజాల సత్తిబాబు పాల్గొన్నారు. అలాగే ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం పందలపాకలో పంపిణీ చేశారు. కూటమి నేతలు పడాల చినబుజ్జి, ఇందల వీరబాబు, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి, గుణ్ణం శ్రీనివాసచౌదరి తదితరులు, బిక్కవోలులో పింఛన్ల పంపిణీలో దేశం నేతలు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు పాల్గొన్నారు. కొంకుదురులో దేశం నేతలు చింతా శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, ఊలపల్లిలో దేశం నేతలు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, కాకర్ల అశోక్, ఇళ్లపల్లిలో తనుకు శ్రీధర్, రంగాపురంలో బీజేపీ నేత ఎం. శివరామకృష్ణంరాజు, కనుమూరి సాయిరాజు పాల్గొన్నారు. బిక్కవోలు ఆటో యూనియన్ సభ్యులు ఎన్టీఆర్, మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి విగ్రహాలకు పాలభిషేకం జరిపారు.

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే బత్తుల, టీడీపీ నేత బొడ్డు

రాజానగరం/ సీతానగరం/కోరుకొండ, జూలై 1: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. రాజానగరంతోపాటు నందరాడ గ్రామంలో ఎమ్మెల్యే బలరామకృష్ణ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణతో కలిసి సోమవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.3 వేలు, జూలై నెల పింఛను రూ.4 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు గ్రామ సచివాలయ ఉద్యోగుల సహాయంతో లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, జేసీ తేజ్‌భరత్ తదితరులు పాల్గొన్నారు. సీతానగరం మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణచౌదరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వలవల రాజా, పెందుర్తి అచ్చుతరామారావు, వలవల నానాజీ, మట్ట వెంకటేశ్వరరావు, కాండ్రు శ్రీనివాసరావు, కాండ్రుశేఖర్ లక్కిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు. కోరుకొండలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, రాష్ట్ర రజక సంఘం నాయకుడు మాతా సీతారాముడు, కటకం చలం, రొంగల శ్రీనివాసు, బదిరెడ్డి దొర, కోర్పు బుజ్జి, దాశెట్టి శ్రీను, రాయభట్టు కృష్ణవేణి, కర్రి పెంటాజీ తదితరులు పాల్గొన్నారు.



కోరుకొండలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల, బొడ్డు



రంగంపేటలో వృద్ధుడికి ఫించన్ అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



'స్టాప్ డయేరియా' పోస్టర్ విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

'స్టాప్ డయేరియా'పై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలి : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 1: డయేరియా నిర్మూలనతోపాటు డెంగ్యూ, మలేరియా రోగాలపై ప్రజల్లో విస్తృత అవగాహన, ప్రచారం కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి వైద్యాధికారులు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డెంగ్యూ, మలేరియా, స్టాప్ డయేరియా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి డెంగ్యూపై అవగాహన కార్యక్రమం ప్రారంభించినట్టు తెలిపారు. ఆగస్టు 31 వరకూ స్టాప్ డయేరియా ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. జిల్లాలో డెంగ్యూ, మలేరియా కేసులు నమోదుకాకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధంచేసుకోవాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమం కింద తాగి చల్లార్చిన నీటిని వినియోగంలోకి తీసుకురావడం, ప్రతి ఇంటినీ సందర్శించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలను అందజేయడం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జేసీ తేజ్‌భరత్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి పాల్గొన్నారు.



రంగంపేటలో స్టాప్ డయేరియా గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రామకృష్ణారెడ్డి

ప్రజల్లో అవగాహన కల్పించాలి : ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట,జూలై1: డయేరియా నిర్మూలనకోసం ప్రజల్లోకి విస్తృతస్థాయి ప్రచార కార్యక్రమాలు తీసుకొని వెళ్లి అవగాహన కల్పించాలని అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రంగంపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి వేణుశ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన 'స్టాప్ డయేరియా' అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో డయేరియా కేసులు నమోదుకాకుండా వైద్యులు, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. తాగునీటి పైపులు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం స్టాప్ డయేరియా గోడ పత్రికలను ఆవిష్కరించారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, రాష్ట్రలీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, మండల అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరాం, జనసేన మండల అధ్యక్షుడు గిరజాల సత్తిబాబు, పోతుల వెంకట్రావు, జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, గారపాటి రాంబాబు, పోతుల చిన్ని, ఎంపీడీవో టి.వెంకటరత్నం, తహశీల్దార్ తలీఫ్‌పాషా, ఐసీడీఎస్ సీడీపీవో జేస్సీ ఫ్లోరెన్స్, పీహెచ్‌సీ వైద్యులు కె.చిన్నారావు, కె.సంకీర్తన, సీహెచ్‌వో కె.జయమణి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ దుర్గాదేవి

బిక్కవోలు, జూలై 1: డయేరియా పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాదేవి సూచించారు. డయేరియా నివారణా కార్యక్రమంలో భాగంగా సోమవారం కార్యక్రమ కరపత్రాలను స్థానిక పీహెచ్‌సీలో దేశం నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంటు వ్యాధులు, కలరా, వాంతులు, విరోచనాలు, మలేరియా, డయేరియా డెంగూ వంటి వ్యాధులు నివారణకు ఈనెల 1 నుంచి ఆగస్టు 31 వరకూ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దేశం నేతలు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, సింగారపు రామారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో స్టాప్ డయేరియా ప్రచారం

సీతానగరం, జూలై1: 'స్టాప్ డయేరియా' క్యాంపెయిన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని సీతానగరం వైద్యాధికారి డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో సీతానగరం మండలంలో ప్రారంభించారు. 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో వచ్చే అతిసార వ్యాధి, దానివల్ల సంభవించే నష్టాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తామని చైతన్య తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, ఎంపీహెచ్‌ఈవో వై సుబ్బారాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బలరామకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న ఉద్యోగులు

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా : బత్తుల

రాజానగరం మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యేకు సత్కారం

రాజానగరం, జూలై1: రాష్ట్రంలో రాజానగరం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద్ద వెంకన్న అధ్యక్షతన సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత అధికారులు, ప్రజాప్రతినిధులతో పరిచయం కార్యక్రమం తదుపరి ఎమ్మెల్యే శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు రాజకీయాల మీద పెద్ద అవగాహన లేకపోయినప్పటికి సమాజానికి ఏదో సేవ చేయాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున తాగునీటి సరఫరా విషయంలో సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలన్నారు. తొలిసారిగా రాజానగరం సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకు మండల పరిషత్ ఉద్యోగులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మందారపు సీతారత్నం, వైస్‌ఎంపీపీ కొల్లి సత్య కోఆప్షన్ సభ్యులు కోడి రాఘవ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహశీల్దార్ షేక్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ టీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, జూలై1: విశ్వవిద్యాలయంలో పరిపాలన పారదర్శకంగా సాగాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తర్వాత రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్‌తో ఎమ్మెల్యే సమావేశమై విశ్వవిద్యాలయంలో పలు అంశాలను చర్చించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి పూర్తి సహాయసహకారాలు అందిస్తానని బత్తుల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి అవసరాలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, జూలై1: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అత్యంత ప్రాధాన్యత కలిగిన పనులు చేపట్టి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టంచేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం సమావేశం మందిరంలో ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో నీటిసరఫరా సంస్థ ప్రతిపాదించిన పనులు, వాటిలో ఇప్పటి వరకు పూర్తిచేసిన వాటి వివరాలు పథకాల వారీగా అందజేయాలన్నారు. దీనికి అధికారులు మాట్లాడుతూ 3,307 పనులను రూ.764,14 కోట్లతో ప్రతిపాదించగా, వాటిలో 1664 పనులు పూర్తికాగా, 227 పనులు పురోగతిలో ఉన్నట్టు తెలిపారు. ఇప్పటివరకు రూ.104.630 కోట్ల చెల్లింపులు కాగా, ఇంకా రూ.27.51 కోట్ల చెల్లింపులు జరపాల్సి ఉందన్నారు. కలెక్టర్ ప్రశాంతి విద్యా కిట్ల పంపిణీపై ఆరా తీశారు. పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక కిట్లు ఆయా పాఠశాలల విద్యార్థులకు అందజేసి గ్రామంలో సూక్ష్మస్థాయి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నాడు-నేడు పనులను కూడా సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి డి బాలశంకర, జిల్లా పంచాయతీ అధికారి డి రాంబాబు, డీఈవో కె వాసుదేవరావు, సర్వశిక్షా అభియాన్ అధికారి ఎస్ సుభాషిణి పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న చంద్రబాబు : గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జూలై1: అంధకార ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల జీవితాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగులు నింపుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. స్థానిక 42వ డివిజన్‌లో సోమవారం అవ్వతాతలకు పెంచిన మొత్తం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు రూ.7 వేలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛనుదార్లకు స్వీట్లు పంచారు. వారి ఆనందంలో గన్ని కృష్ణ పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి కోటిలింగేశ్వరరావు, ఆర్ సుబ్బారావు, కేవీ శ్రీనివాస్, వానపల్లి శ్రీనివాసరావు, ఆదారి లక్ష్మీనారాయణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మేలు చేయడమే సంక్షేమం : ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, జూలై1: సంక్షేమమంటే పగప్రతీకారాలు కాదని, పేదల కష్టాలు తెలుసుకొని వారికి మేలు చేయడమేనని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెం, రంపయర్రంపాలెం, గోకవరం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోకవరంలోని ఓ ఇంటికి ఎమ్మెల్యే నెహ్రూ స్వయంగా వెళ్లి లబ్ధిదారుడికి ఆయన చేతుల మీదుగా పింఛను అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ గోకవరం-తంటికొండ వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం నిమిత్తం రూ.3.75 కోట్లు మంజూరయ్యాయని, రెండు, మూడు రోజుల్లో నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. టీడీపీ నేతలు పాలూరి బోస్, కన్నబాబు, అడపా భరత్, ఉంగరాల రాము, గాజింగం సత్తిబాబు, పోసిన ప్రసాద్, సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీలకు పాలభిషేకం

రాజమహేంద్రవరంసిటీ,జూలై1: కూటమి ప్రభుత్వం పింఛన్లు పెంచి లబ్ధిదారులకు అందించడంతో జిల్లా డెఫ్ అసోసియేషన్ సంబరాలు నిర్వహించింది. సోమవారం పుష్కరాలరేవు ఎన్టీఆర్ విగ్రహం వద్ద రాష్ట్ర కార్యదర్శి పి శశికుమార్ ఆధ్వర్యంలో బాబు, పవన్ ఫ్లెక్సీలకు పాలభిషేకం చేశారు.



నేను మీ వాడిని : గొల్లప్రోలు సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభివాదం

నువ్వు చల్లగుండాలయ్యా : వృద్ధురాలి ఆశీర్వాదం

పింఛన్.. ఆనందించెన్..

తూర్పుగోదావరి	
లబ్ధిదారులు :	2,41,771
అందుకున్నవారు :	2,32,840
మొత్తం శాతం :	96.31

అంబేడ్కర్ కోనసీమ	
లబ్ధిదారులు :	2,43,534
అందుకున్నవారు :	2,33,944
మొత్తం శాతం :	96.06

కాకినాడ	
లబ్ధిదారులు :	2,79.319
అందుకున్నవారు :	2,62,423
మొత్తం శాతం :	93.95



కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన చేనేత కార్మికులు, కొప్పుల సత్యవతి, గుత్తి సూర్యకాంతం



మీకు మేమున్నాం : నిడదవోలు మండలం గోపవరంలో దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి దుర్గేష్



హ్యాపీగా బతకాలి : రాజమండ్రి 11వ డివిజన్ పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే వాసు



ఎవరిపై ఆధారపడకుండా : రాజమండ్రి రూరల్‌లో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల



బామ్మ..పింఛన్ పెంచాం : బిక్కవోలులో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అమ్మా ఆనందమేనా : రాజానగరంలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల చిత్రంలో బీవీఆర్ చౌదరి



హామీ ఇచ్చాం..నెరవేర్చాం : కొవ్వూరులో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ద్విసభ్య కమిటీ సభ్యులు



పెన్షన్.. ఇక నో టెన్షన్ : దేవరపల్లిలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

కూటమి తొలి అడుగే.. సూపర్‌హిట్

- ఇంటి వద్దనే రూ.7 వేలు అందెన్
- పండుగలా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 2,32,840 మందికి అందజేత
- పంపిణీ చేసిన మొత్తం రూ.157.32 కోట్లు
- ఉదయం 5 గంటలకు ఆరంభం
- రాత్రి 7.30 గంటల వరకూ పంపిణీ
- ప్రభుత్వ ఉద్యోగులకు అభినందన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కూటమి వచ్చింది.. ఇంటింటా ఆనందం తెచ్చింది.. హామీలు ఇచ్చారు.. ఎలా చేస్తారో చూస్తాం అంటూ గత పాలకులు చేసిన విమర్శలకు ధీటుగా పింఛన్ల పంపిణీ సాగింది.. వలంటీర్లు లేక పోయినా తొలిరోజే ఏకంగా 96.31 శాతం పింఛను పంపిణీ చేసి చూపించారు..శెహబాస్ అనిపించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్టీ ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఓ పండుగలా సాగింది. ఉద యం 6 గంటలకు లబ్ధిదారుల ఇళ్లకు చేరుకున్న సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, టీడీపీ ,జనసేన,బీజేపీ శ్రేణులు అవ్వా తాతలు, దివ్యాంగులు, కళాకారులను లేపి పింఛన్లు అందజేశారు. ఒక్కరోజే జిల్లాలో ఏకంగా 96.31 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది.

ఒక్కరోజులోనే 96.31 శాతం..

గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా 1 నుంచి 5వ తేదీ వరకూ పింఛన్లు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఏకంగా ఒకే ఒక్క రోజులో 96.31 పింఛన్లు పంపిణీ చేసి అభా గ్యుల గుండెల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఊళ్లో లేనివారి, ఇతర కార ణాల వల్ల బయట ఉన్నవారికి తప్ప మిగతా వారందరికీ పింఛన్లు అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల జోక్యం వద్దని ఎన్ని కల కమిషన్, కోర్టు ఆదేశించడంతో గత వైసీపీ ప్రభుత్వం రెండు నెలల పాటు పింఛన్‌దారులకు చుక్కలు చూపించిన సంగతి తెలిసిందే. వలంటీర్ల చేత బలవంతంగా రాజీనామాలు చేయిం చారు. వలంటీర్లు లేకపోతే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ జరగదని.. సచివాలయ ఉద్యోగుల వల్ల సాధ్యం కాదని తేల్చేశారు. పింఛన్ల పంపిణీలోనూ ఓటు రాజకీయం చేశారు. పింఛను సొమ్ము బ్యాంక్ ఖాతాల్లో వేసి పింఛన్‌దారులకు నరకం చూపించారు. పైగా ఈ నెపాన్ని చంద్రబాబుపై తోయడానికి వైసీపీ విశ్వప్రయత్నం చేసిం ది. అప్పటికే ఎన్నికల ప్రచారం నిమిత్తం జిల్లాలోని నల్లజర్లలో ఉన్న చంద్రబాబు అక్కడే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తాను పింఛన్ రూ.4 వేలు చేయడంతో పాటు, ఏప్రిల్ నుంచే అమలు చేసి, జూలై1న రూ.7 వేలు ఇస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయన తన మాటను నిలబెట్టుకున్నారు. పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు పోటీ పడ్డారు.నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ పలుచోట్ల పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బూరు గుపల్లి శేషారావు ఉన్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు , రాజానగరంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ, అనపర్తిలో బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు గ్రామ గ్రామాన పింఛన్లు పంపిణీ చేశారు.

ఉదయం 5 గంటలకే ఆరంభం..

సోమవారం ఉదయం 5గంటలకు మొదలైన పింఛన్ల పంపిణీ పండగా ఉదయం 8.30 గంటలకే 45 శాతం దాటేసింది. ఇది ఒక జాతరలా సాగింది. కానీ సర్వర్లు డౌన్ కావడం వల్ల సుమారు రెండు గంటల పాటు ఇబ్బంది ఏర్పడింది. అయినా చంద్రబాబు భరోసాను ఓ చాలెంజ్‌గా తీసుకున్న సచివాలయ, ఇతర ఉద్యోగులు టిఫిన్ కూడా మానేసి పింఛన్ల పంపిణీపైనే దృష్టి సారించారు.కొందరు మధ్యాహ్నం భోజనం కూడా చేయలేదు.జిల్లా యంత్రాంగం పగడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పాటు శనివారం సాయంత్రమే పంపిణీకి సంబంధించిన సొమ్మును ఉద్యోగులకు అందజేసింది. దీని వల్ల వారు ఇళ్లకు తీసుకుని వెళ్లి రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేలు వంతున వేర్వేరు కట్టలుగా కట్టుకుని సిద్ధం చేసుకు న్నా రు.దీంతో పంపిణీ సులభమైంది. ఉద్యోగులకు తోడుగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అన్ని చోట్ల భాగస్వాములయ్యారు.

పింఛన్ల పంపిణీ సాగిందిలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	పంపిణీ
రాజమండ్రి సిటీ	29,436	20,24,48,000
రాజమండ్రి రూరల్	32,006	21,78,95,500
రాజానగరం	39,777	26,67,14,500
అనపర్తి	30,260	20,21,92,500
నిడదవోలు	35,817	24,18,17,500
గోపాలపురం	32,058	21,80,25,000
కొవ్వూరు	31,716	21,24,31,716

హ్యాపీగా ఉండండి : కలెక్టర్ ప్రశాంతి

హ్యాపీనా! అందరూ సంతోషంగా ఉన్నారా.. సీఎం నారా చంద్రబాబు నాయుడు పెంచిన పింఛన్లు తీసుకుని హ్యాపీగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి లబ్ధిదారులతో ముచ్చటించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్‌లో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమహేంద్రవరం 11వ డివి జన్‌లో ఎందుకు ఆరంభించామో తెలుసా? గతంలో పింఛన్లు ఇవ్వడానికి మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన జగన్‌కు ప్రజలు ఇచ్చిన 11 సీట్లు గుర్తు చేయడానికేనని అనడంతో అందరూ నవ్వుకున్నారు.



రంగంపేటలో చంద్రబాబు చిత్రపటానికి పింఛనుదారుల పాలభిషేకం

ఒక్క రోజే 2,32,840 మందికి అందజేత

జిల్లాలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పిం ఛన్లు 95.87 శాతం పంపిణీ చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం 5 గంటలకే ప్రారంభించినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 4092 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి నగదు పంపిణీ చేశారన్నారు. రాత్రి 7.30 గంటల వరకూ పింఛన్లు పంపిణీ చేశారని తెలిపారు. నగదుతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశలేఖను అంద జేశామన్నారు. జిల్లాలో మొత్తం 2,41,771 మంది పింఛనుదారులు ఉండగా ఒక్కరోజులోనే ఏకంగా 2,32,840 మందికి పంపిణీ చేశా మన్నారు.మొత్తం రూ.163.36 కోట్లు అందించాల్సి ఉండగా రూ.157.32 కోట్లు పంపిణీ చేశామన్నారు. మంగళవారం సాయం త్రంలోపు మొత్తం అందరికీ పింఛన్లు పంపిణీ చేసే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.తొలిరోజే సుమారు 96 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసిన సచివాలయ,ఉద్యోగులను అభినందిస్తున్నట్టు తెలిపారు.

పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా

- పనిచేసే..మన్ననలను పొందుతా
- రక్షణ పేరుతో ఆంక్షలు వద్దు
- స్థలం చూస్తున్నా.. ఇల్లు కట్టుకుంటా
- ఉపాధిని మెరుగుపరుస్తా
- పింఛన్ల పంపిణీ సభలో పవన్

పిఠాపురం/గొల్లప్రోలు, జూలై 1: దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ కల్యాణ మం డపంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు అందజేసి మాట్లా డారు. పిఠాపురం నియోజకవర్గంలో తాగునీటి సమ స్యను పరిష్కరించాల్సి ఉందన్నారు. కొత్తపల్లి మండ లంలోని సముద్రపు తీరప్రాంతాల్లో తాగునీటి కోసం అక్కడ మహిళలు పడుతున్న కష్టాలను తాను స్వయంగా చూశానని తెలిపారు. పిఠాపురం నియోజక వర్గంలోని గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలా ల్లోని కొన్ని గ్రామాలను ఎంపిక చేసి అక్కడ నూరు శాతం శానిటేషన్ చేయడంతో పాటు ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించడం చేద్దామని భావిస్తున్నట్టు తెలి పారు. నా నియోజకవర్గంలో సక్సెస్ అయిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అదే మోడల్‌లో శానిటేషన్ చేయిస్తా మన్నారు. ప్రజలను, పోలీసులను, అధికారులను ఇబ్బందులు పెట్టి విజయయాత్ర చేయాలనుకోలేదని, పనిచేసిన తర్వాతే తనకు విజయయాత్ర అని స్పష్టం చేశారు. పనిచేసి మన్ననలు పొందితేనే తనకు ఆనం దం. అప్పుడే నేను ఎమ్మెల్యేను అయ్యాను అన్న ఆనందం కలుగుతుందని తెలిపారు. ఎక్స్‌పర్ట్‌లను తీసు కువచ్చి పిఠాపురానికి మేలు చేసే దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో 40,765 మందికి పింఛన్ల రూపేణా రూ.27.34 కోట్లు అందజేస్తున్నామని చెప్పారు. వారం విడిచి వారం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరు ఇక్కడే ఉండి సమ స్యలు పరిష్కరిస్తారని చెప్పినందుకు కృతజ్ఞతలు తెలి యజేస్తున్నానని చెప్పారు. దివ్యాంగులకు 40 శాతం వికలాంగత్వం ఉంటేనే పింఛన్ అందుతోందని, ఇం దులోనూ ఎన్నో సమస్యలు ఉన్నాయని, 90 శాతం ఉన్నవారికి సదరంలో సర్టిఫికెట్ రావడం లేదని, ఇటు వంటి వాటిని సరిచేస్తామని ప్రకటించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తన మొదటి పర్యటన ఇదని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఎన్నికల్లో గెలిచి ఊరేగింపు చేసుకోవడం నాకు ఇష్టం లేదు. పనిలోకి వెళ్లాలనుకున్నా. పింఛన్లు అందించి కృతజ్ఞతలు చెబు దామని భావించానని చెప్పారు. భారీ మెజార్టీతో గెలి పించిన ప్రజల కోసం తక్కువ మాటలు చెప్పి ఎక్కువ పనిచేయాలన్నది నా భావన అన్నారు. ఇప్పుడు అధికా రంలో ఉన్నాం. ఇది అసలైన ఛాలెంజ్ అని తెలిపారు. దివ్యాంగుల సమస్యలను జనవాణిలో విన్నా.. నిజంగా గత ప్రభుత్వంలో అన్యాయానికి గురైన వారు ఉన్నా రంటే దివ్యాంగులేనని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెం ట్‌కు ప్రాధాన్యమిస్తూ అందరిలో ఉన్న ప్రతిభ, సమర్థ తను వెలికితీస్తామని తెలిపారు. అంతకుముందు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాప్ డయే రియా కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ ప్రారంభిం చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మో హన్,ఎస్పీ సతీష్‌కుమార్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, బుర్రా కృష్ణంరాజు పాల్గొన్నారు.



వెల్‌కమ్ సార్ : డిప్యూటీ సీఎం పవన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి



పిల్లల భవిష్యత్ చూస్తున్నా : గొల్లప్రోలు సభలో పవన్

ప్రజలకు ఆంక్షలు పెట్టవద్దు...

ప్రజల దగ్గరకు వచ్చినప్పుడు దయచేసి రక్షణ పేరుతో ఆంక్షలు పెట్టవద్దని.. గతంలో జనవాణి, ఇతర సందర్భాల్లో ప్రజలను ఎలా కలుసుకునే వాడినో అలా గే కలుసుకోనివ్వాలని డిప్యూటీ సీఎం పవ న్‌కల్యాణ్ పోలీసు యంత్రాంగానికి సూచించారు. సీఎం, డిప్యూటీ సీఎం అని నేనెప్పుడూ అనుకోలేదు. కష్టపడే వ్యక్తిగా ఈ స్థానంలో ఈ రోజున కూర్చున్నాను. మీరు వేసి ప్రతి ఓటు సరైన వ్యక్తికి, కూటమికి వేశామని గర్వపడే విధంగా తన పనితీరు ఉంటుందని పవన్‌కల్యాణ్ తెలిపారు. చక్రి అనే బాలుడిని వేదిక మీదకు పిలిపిం చుకుని ఇటువంటి బిడ్డల భవిష్యత్తు కోసం పనిచేస్తానని చెప్పారు. నా బిడ్డలు కోసం ఎంత తపన పడతానో తెలియదు కానీ ఇటువంటి బిడ్డల కోసం ఈ తరమే కాదు రానున్న రెండు తరాల కోసం పనిచే స్తానని తెలిపారు. ఇది టీడీపీ లీడ్ చేసే ప్రభుత్వం, జనసేన వెన్న దున్నుగా నిలిచిన ప్రభుత్వం, ప్రధాని మోదీ, బీజేపీ పెద్దలు ఆశీస్సులు ఉన్న ప్రభుత్వమని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలు రుణం తీర్చుకుంటానని పవన్ తెలిపారు.నియోజకవర్గంలో స్థలం కోసం చూస్తున్నానని.. సొంతిం టిని కట్టుకుంటానని ప్రకటిం చారు. మీ అందరి మధ్యే ఉంటానని చెప్పారు.





మీకు అండగా : గొల్లప్రోలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న పవన్

మాకు చంద్రబాబు పెద్దకొడుకే..

చేనేత కార్మికుల కుటుంబాలకు చంద్రబాబు పెద్దకొడుకు.. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచారు. ఒకే సారి రూ.7 వేలు తీసుకో వడం సంతోషంగా ఉంది. **- కొప్పుల సత్యవతి, గుత్తి సూర్య కాంతం, చేనేత కార్మికులు, దుళ్ల, కడియం మండలం**

రూ.15 వేల పింఛను.. రుణపడి ఉంటా..

మంచానికి పరిమితమై ఇంటికి భారంగా బతుకుతున్న నాకు చంద్రన్న జీవితంపై ఆశను కల్పించారు. నెలకు రూ.15 వేల పింఛను అందిస్తున్నారు.చంద్రన్నకు రుణపడి ఉంటా.

- గొలుగూరి నాగిరెడ్డి, లబ్ధిదారుడు, అనపర్తి

మంచం దిగలేనన్న బాధ తప్ప ఇంకేం లేదు



నాకు రూ.15 వేల పింఛను ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. నేను మంచం దిగలేను. పెరాలిస్ వచ్చి కాళ్లు, చేతులు పడిపోగా తర్వాత న డుం జారిపోయింది. మందులకు బోలెడంత ఖర్చవుతోంది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పుణ్యమాని ఈనెల నుంచి రూ.15 వేలు వస్తోంది. నాకు ఇంక లేవలేనన్న దిగులు తప్ప ఇంకే విధమైన దిగులు లేదు.

- వడ్లమూరు నర్సమ్మ, చినకొండేపూడి, సీతానగరం మండలం

ఆసుపత్రికి వెళ్లి..పింఛను అందజేత



చాగల్లు మండలం నెల టూరుకు చెందిన అంగారపు సురేష్ తీవ్ర అనారోగ్యంతో రాజమ హేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక సచివాలయ సిబ్బంది పింఛను అందజేయడానికి ఇంటికెళితే విషయం తెలిసింది. దీంతో సచివాలయ మహిళ సంరక్షణ కార్యదర్శి దీప్తి ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు.

అర్జీలపై విచారణ చేపట్టి 24 గంటల్లో నివేదిక ఇవ్వండి

ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ ప్రశాంతి



ప్రజా పరిష్కార వేదికలో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 1 : ప్రజాసమస్యల పరిష్కారవే దికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై తగిన విచారణ చేపట్టి 24 గంటల్లో ఆ సమస్యల వాస్తవ స్థితిని వివరిస్తూ తనకు నివేదిక అందజేయాలని కలెక్టర్ పి ప్రశాంతి అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వచ్చిన 80 అర్జీలను కలెక్టర్ ప్రశాంతి, జేసీ తేజ్ భరత్ స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.ఈ ప్రక్రియపై సంబంధిత జిల్లా అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన 80 అర్జీలలో ఆన్‌లైన్‌లో 77 ,ఆఫ్‌లైన్‌లో 3 వచ్చాయని తెలిపారు. నిడదవోలు డివిజన్ పరిధిలోని నరసా పురం నీటిపారుదల శాఖ సబ్‌డివిజన్ సిద్ధాంతం సెక్షన్‌లో అవుట్ సోర్సిం గ్‌లో లస్కర్‌గా పనిచేసిన చిట్టాల శేషునాయుడు తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించారని నిరసన తెలిపారు. 68 ఏళ్ల రిటైర్డ్ ఐసీ అసిస్టెంట్ జగన్నాథరావుకు ఈ ఉద్యోగం ఇచ్చి ఈఈ దక్షిణ మూర్తి తనకు అన్యాయం చేశాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. రూ70వేలు లంచం తీసుకు న్నారని నా ఉద్యోగం పోవడంతో నేను నా భార్య పిల్లలు రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు 10నెలల జీతం పెండింగ్ ఉందని చెప్పాడు. ఇప్పటికి 6 సార్లు కలెక్టరేట్‌లో అర్జీపెట్టుకున్నానని ఈసారైనా న్యాయం చే యాలని వేడుకున్నాడు. రూరల్ మండలం ఎర్రగొండ సుగుణనగర్ ప్రాంతా నికి చెందిన సత్యవేణి తమ ప్రాంతంలో వీధి దీపాలు, డ్రైనేజీలు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెత్తఎక్కడపడితే అక్కడ ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికి ఐదు సార్లు అర్జీ పెట్టినా ఎవ్వరు పట్టించుకోలేదని చెప్పారు. శ్రీచైతన్య టెక్నో, భాష్యం తదితర స్కూల్స్‌లో ప్రభుత్వ కోటాతో ఫ్రీసీటు పొందిన విద్యార్థులు తల్లిదండ్రులు కలెక్టర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. తమ పిల్లలను చేర్చుకున్న ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ప్రభు త్వ జీవోకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఫీజులు యథావిధిగా చెల్లించ మని చెబుతున్నారని వాపోయారు. ప్రభుత్వ కోటాలో ఫ్రీ సీటు పొందిన మా పిల్లలను స్కూళ్లలో మిగిలిన పిల్లలతో కలపకుండా వేరొక గదిలో కూర్చోపెట్టి వేరుగా ట్రీట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు ప్రభుత్వ జీవో ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యను అందించేలా చర్యలు తీసుకో వాలని కోరారు. కాతేరుకు చెందిన ధర్మలింగం గ్రామంలో నూతన ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని అర్జీ పెట్టుకున్నాడు. రాజానగరం మండలం చక్రద్వార బంధం గ్రామానికి చెందిన బోడెం మంగతాయారు తన గ్రామంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసే చౌకధరల దుకాణాన్ని బీనామిదారులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ అర్జీలను పరిశీలన చేసి 24గంటల్లో నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 20 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం(మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ జగదీశ్ స్వయంగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. జూమ్ కాన్ఫరెన్స్ విధానంలో ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాట ఇతర కేసులకు సంబంధించి మొత్తం 20 అర్జీలను ఎస్పీ స్వీకరించి పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే విధంగా చట్ట పరిధిలో వాటిని త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రోడ్డు కం రైలు బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్



కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నిలిచిన ట్రాఫిక్

కొవ్వూరు, జూలై 1: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం 9-30 గంటల నుంచి 11 గంటల మధ్యలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు టోల్‌గేట్ వద్ద గడ్డర్ల సమీపంలో ఏలూరు డిపో బస్సు మొరాయించింది. అదే సమయంలో కొవ్వూరు వైపు బ్రిడ్జిపై మలుపులో మరో బస్సు మొరాయించి నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న రాజమహేంద్రవరం, కొవ్వూరు పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మొరాయించిన బస్సులను ప్రయాణికులు పక్కకు నెట్టారు.

దొమ్మేరు సొసైటీ సభ్యులు కేవైసీ చేయించుకోవాలి

దొమ్మేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యులు కెవైసి చేయించుకోవాలని సొసైటీ కార్యదర్శి కరిబండి ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు కొవ్వూరు మండలం దొమ్మేరు సొసైటీ పరిదిలోని దొమ్మేరు, దొమ్మేరు సాఖం, పెనకనమెట్ట, పెనకనమ్మె సావరం గ్రామాలలో గల సొసైటీ సభ్యులు రూ. 300లు షేరు ధనం కలిగి ఏవిధమైన వ్యాపారం చేయని సభ్యులు వారి యొక్క ఆదార్, పాన్‌కార్డు, ఫోన్ నంబరు, పూర్తి వివరములను సొసైటీలో అందించి కంప్యూటరైజేషన్‌కు సహకరించాలని అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కె, సుబ్బారావు, కార్యదర్శి కరిబండి ప్రసాద్ తెలిపారు.

కొవ్వూరు సొసైటీ సభ్యుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

కొవ్వూరు, జూలై 1: కొవ్వూరు సొసైటీ పరిధిలోని కొవ్వూరు, వేములూరు గ్రామాల్లోని సంఘం సభ్యులు తమ ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్లు అందించాలని, కంప్యూటరైజేషన్‌కు సహకరించాలని కార్యదర్శి బొర్రా రాధాకృష్ణ కోరారు. రెండు నెలలుగా సొసైటీ రికార్డులను కంప్యూటరైజేషన్ చేస్తున్నామని, సొసైటీలో సభ్యత్వం తీసుకుని ఇంతవరకు ఎటువంటి లావాదేవీలు జరపని సభ్యులు సంఘంలో కొనసాగాలంటే తమ పూర్తి వివరాలు అందించాలని చెప్పారు.

పోతవరం సొసైటీ రైతులు రికార్డులు అందించాలి

నల్లజర్ల, జూలై 1: పోతవరం వ్యవసాయ సొసైటీలో సభ్యత్వం ఉన్న రైతులు తమ రికార్డు వివరాలను అందిస్తే కంప్యూటరైజేషన్ చేస్తామని కార్యదర్శి కాపూరి శ్రీనివాసరావు చెప్పారు. పోతవరం సొసైటీ పరిధిలో ఉన్న పోతవరం, పోతినీడుపాలెం, చాదరాశికుంట, సుబ్రహ్మపాలెం గ్రామాల్లోని రైతులు ఆధార్‌కార్డుతోపాటు భూ రికార్డులను తీసుకుని రావాలన్నారు. సభ్యత్వం ఉండి ఇప్పటి వరకు ఎటువంటి లావాదేవీలు జరపని వారు వెంటనే సొసైటీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ఘనంగా సువర్ణరాజు పుట్టినరోజు



దేవరపల్లిలో కేకు కట్ చేస్తున్న సువర్ణరాజు

దేవరపల్లి, జూలై 1: జనసేన నియోజకవర్గ కన్వీనర్ సువర్ణరాజు పుట్టినరోజు సందర్భంగా దేవరపల్లిలో డిగ్రీ కాలేజీ వద్ద వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం సాయంత్రం కట్ చేశారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాట్నం గణేష్, కంబాల సత్తిబాబు, చప్పటి శివనాగప్రసాద్, సీఐ శ్రీనివాస్, సూరిశెట్టి బాలు, పసుపులేటి ప్రసాద్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయులుకు బెస్ట్ ప్రెసిడెంట్ ప్లాటినం అవార్డు

నిడదవోలు, జూలై 1: విజయవాడలో జరిగిన రోటరీ అవార్డ్స్ నైట్‌లో ఉత్తమ సామాజిక, సమాజ సేవ కార్యక్రమాలకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుకు 27 అవార్డులు అందుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులుకు బెస్ట్ ప్రెసిడెంట్ ప్లాటినం అవార్డును గవర్నర్ రావూరి వెంకటసుబ్బారావు అందజేశారు. ఆయనతో పాటు పలువురు క్లబ్ డైరెక్టర్లకు, సభ్యులకు పలు అవార్డులు లభించాయి. అవార్డులు అందుకున్న రోటరీ ప్రతినిధులను పలువురు అభినందించారు.

నిడదవోలులో జాతీయ వైద్యుల దినోత్సవం



వైద్యుల దినోత్సవంలో పాల్గొన్న డాక్టర్లు

నిడదవోలు, జూలై 1: వైద్యులు, హాస్పిటల్స్ సిబ్బంది రోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వడం ఎంతో ముఖ్యమని సీనియర్ సర్జన్ డాక్టర్ నల్లా శ్రీరామ్మూర్తి అన్నారు. సోమవారం నిడదవోలులోని సిరి ఐసీయూ, ఎమర్జెన్సీ, చిల్డ్రన్స్ హాస్పిటల్స్‌లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ సిద్ధార్థ కన్నాజీ మాట్లాడుతూ వైద్య సేవలు పొందిన రోగి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లడమే డాక్టర్లు కోరుకుంటారన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ డాక్టర్ శిరీష తోట, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు. వైద్యులను స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సత్కరించారు.

అధ్యాపకుడు రామప్రసాద్‌కు సన్మానం

ఉండ్రాజవరం, జూలై 1: ఉండ్రాజవరం ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకుడిగా పనిచేస్తున్న కోట రామప్రసాద్ పదవీ విరమణ సభ సోమవారం రాత్రి జరిగింది. ఆయన ఉపాధ్యాయ వృత్తిలోను, రచయితగా సమాజానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం రామప్రసాద్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సక్సేనరాజు, శారదా జ్యోత్స్న, పలువురు యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు ఫిర్యాదులు

కొవ్వూరు, జూలై 1: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. తాళ్లపూడి వ్యవసాయశాఖకు 1, విద్యాశాఖకు 1, కొవ్వూరు తహ శీల్దార్‌కు 2, కొవ్వూరు మండలం పసివేదల గ్రామంలో మురుగునీటి బోదెపై ఫిర్యాదులను స్వీకరించామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలి

గోపాలపురం, జూలై 1: చట్టాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని దేవరపల్లి సీఐ సురేష్‌బాబు అన్నారు. చట్టాలపై చెరుకుమిల్లిలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరు చట్టానికి లోబడి నడుచుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నేరాలకు శిక్షలను కఠినతరం చేసిందన్నారు. సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి వాటిని న్యాయపరంగా పరిష్కరించుకోవాలన్నారు. ఎస్ఐ కె.సతీష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు, గ్రామస్థులు హాజరయ్యారు.

కొవ్వూరు: మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో స్వర్ణాంధ్ర ఆటో యూనియన్, లారీ యూనియర్, డ్రైవర్స్ గ్రామస్థులకు నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చట్టాలను సవరించిందని దీని ప్రకారం. భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)ని భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)గా, భారతీయ నేర విచారణ ప్రక్రియ (సీఆర్‌పీఎస్)ను భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)గా, భారతీయ సాక్ష్య చట్టం (ఐఈఏ)ని భారతీయ సాక్ష అధినియమం (బీఎస్ఏ)గా మార్పు చేసినట్టు చెప్పారు. 2024 జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమలుల్లోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంటు సోమరాజు, లారీ ఓనర్స్ & డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్, సీహెచ్ శివ, దుర్గారావు పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న దళిత నాయకులు

ఉండ్రాజవరం, జూలై 1: మండలంలోని వెలగదుర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం దళిత నాయకులు 2024 ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే గౌరీపట్నం పాదయాత్ర చేస్తామని మొక్కుకున్నారు. ఈ మేరకు పాదయాత్రగా వెళ్లి మొక్కు చెల్లించుకున్నట్టు దళిత నాయకులు సోమవారం తెలిపారు. సీఎం చంద్రబాబుతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించామన్నారు. కార్యక్రమంలో పాతూరి నరేంద్రబాబు, పోలుమాటి సూర్యారావు, బడుగు నవీన్, పోలుమాటి మోహన్, అమర్‌బాబు, పులిదిండి కృష్ణ, పోలుమాటి పద్మారావు, విప్పర్తి కృష్ణ, హరిబాబు పాల్గొన్నారు.



కొవ్వూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



నల్లజర్లలో వృద్ధుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



గోపాలపురంలో వృద్ధురాలికి సొంత సొమ్ములను పింఛనుగా ఇస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ఆనందం@రూ.7 వేలు

- ఎన్నికల హామీలు ఒక్కొక్కటిగా అమలు
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- పలుచోట్ల లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- పింఛనుదారులకు రూ.7,000 అందజేత

కొవ్వూరు, జూలై 1: సామాజిక పింఛన్లకు టీడీపీ బ్రాండ్ అంబాసిడర్ అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీని సోమవారం కొవ్వూరులోని యానాది కాలనీ, అచ్చాయమ్మ కాలనీ, రాజీవ్ కాలనీల్లో ఆయన ప్రారంభించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా పింఛన్లు రూ.4 వేలు అందజేస్తామని, గడిచిన మూడు నెలలకు సంబంధించి రూ.3 వేలు కలిపి జూలై నెల పింఛను రూ.7 వేలు అందజేస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.35 సామాజిక పింఛను ప్రారంభించగా తరువాత వచ్చిన చంద్రబాబు రూ.70 చేశారని, అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.130 పెంచి రూ.200 చేశారన్నారు. 2014-19 సమయంలో చంద్రబాబు రూ.2 వేలుకు పెంచారని, ఆపై జగన్ రూ.3 వేలు చేస్తానని చెప్పి రూ.250 చొప్పున ఐదేళ్లకు రూ.3 వేలు చేశారన్నారు. మరలా ఇప్పుడు చంద్రబాబు పింఛన్‌ను రూ.4 వేలుకు పెంచారని ఎమ్మెల్యే ముప్పిడి అన్నారు. త్వరలోనే అన్న క్యాంటీన్‌లు ప్రారంభిస్తామన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ఎన్నికల మ్యానిఫెస్టోను ఒక్కొక్కటిగా అమలుచేస్తామన్నారు. కాగా సామాజిక పింఛన్లను రూ.4 వేలుకు పెంచడం పట్ల యానాది కాలనీ, అచ్చాయమ్మ కాలనీల్లో సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే ముప్పిడి, లబ్ధిదారులు పాలభిషేకం చేశారు. కొవ్వూరు మండలం పశివేదలలో సర్పంచ్ తుంపల్లి సింహాచలం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాల్లో దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూర్యదేవర రంజిత్, పిల్లలమర్రి మురళీకృష్ణ, పొట్రు శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసఫ్, పొట్రు మురళీకృష్ణ, మద్దిపట్ల మురళీకృష్ణ, కె.నవ్య, మద్దుల సత్యనారాయణ, అర్జిల్లి రామకృష్ణ, బేతిన నారాయణ, తుంపల్లి ఆదినారాయణ, గారపటి శ్రీనివాసరావు, గారపాటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం, త్యాజంపూడి, కురుకూరు, పల్లంట్ల, దేవరపల్లి, గౌరీపట్నం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించి కొంతమంది లబ్ధిదారులకు పింఛను సొమ్ములు అందజేశారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ ప్రజలు ఎన్డీఏ కూటమికి బ్రహ్మరథం పట్టి 164 సీట్లు ఇచ్చారని, ఈ విజయం కార్యకర్తలకు, ప్రజలకు అంకితమన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమం చంద్రబాబు పవన్‌కల్యాణ్ సారథ్యంలో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ కన్వీనర్ సువర్ణరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, గన్నమని హరికృష్ణ, దుర్గారావు, కొయ్యలమూడి చినబాబు, గద్దే సుబ్రహ్మణ్యం, రాంబాబు, కరుటూరి శ్రీనివాస్, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, కాట్నం గణేష్, కంబాల సత్తిబాబు పాల్గొన్నారు.

నల్లజర్ల: నియోజకవర్గంలో పింఛన్ పంపిణీ కార్యక్రమం పండుగలా జరిగింది. ఉదయం 6గంటల నుంచే ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని 26 గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. నల్లజర్లలో వృద్ధులకు పింఛను అందజేసి స్వీట్లు అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖజానా ఖాళీ చేసిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని, ఆర్థిక వనరులు లేకపోయినా సీఎం చంద్రబాబు ఎన్నికల హామీని నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, దొడ్డిగర్ల సువర్ణరాజు, జమ్ముల సతీష్, రావూరి వెంకటరమణ, కండెపు వెంకటరత్నం, యలమాటి శ్రీనివాసరావు, చెల్లు పెద్దరామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు, వల్లూరి సత్తిపండు, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, ఏలేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని గోపాలపురం, వేలచింతలగూడెం, పెద్దాపురం, చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పింఛన్ల కోసం పడిగాపులు పడి ఎదురు చూసే పరిస్థితి గత ప్రభుత్వానిదైతే 1వ తేదీనే పింఛన్లు అందించే ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమంలో భాగంగా తనకు పింఛన్ రాలేదంటూ కన్నీటి పర్యంతమైన గోపాలపురానికి చెందిన పెంకి మహలక్ష్మి అనే వృద్ధురాలికి సొంత సొమ్ము పింఛన్‌గా ఇచ్చి. పింఛన్ ఇప్పించే బాధ్యత నాదంటూ మద్దిపాటి భరోసా ఇచ్చారు. పింఛన్ పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన మద్దిపాటికి గోపాలపురం పంచాయతీ కార్యాలయం వద్ద ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు, ఉపాధ్యక్షుడు దొరబాబు, కార్యదర్శి రమేష్, శ్రీధర్, కూనవం ప్రసాద్‌బాబు, నవీన్, ఎంపీడీవో రమేష్, సీఐ బాల సురేష్, ఎస్ఐ సతీష్‌బాబు, టీడీపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు, వేలివెన్ను, వెలగదుర్రు, వడ్లూరు, సత్యవాడ, సూర్యారావుపాలెం, పసలపూడి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందదర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధి ధ్యేయంగా సీఎం చంద్రబాబు పరిపాలన సాగిస్తారన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నాయకులు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, వీరమళ్ల బాలాజీ, రాచమళ్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో నరేంద్రరెడ్డి, ఈవోపీర్డీ జేడీవీ ప్రసాద్ పాల్గొన్నారు. కాగా ఒకేసారి రూ.7 వేలు పింఛను పొందడంతో ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కె.సత్యవతి అనే మహిళ ఆనందం వ్యక్తంచేసింది. తమ లాంటి ఆసరా లేనివారికి ప్రభుత్వం రూ.7 వేలు ఇవ్వడం వల్ల తమ జీవన గమనానికి భరోసా కల్పించిందని పేర్కొన్నారు.

చాగల్లు: మండలంలోని చాగల్లు, నెలటూరులో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరవు పాల్గొని పింఛన్లు అందజేశారు. కార్యక్రమలో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, సర్పంచ్‌లు యడ్లల్లి ఉమారజని, మనశ్శాంతి, జనసేన నాయకులు ఉప్పూరి చిరంజీవి, ఆర్.భూషణం, ఇంటి వీరబాబు, బీజేపీ నాయకులు తాళ్ళరి వరప్రసాద్, జుట్టు గణపతి పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే వేగేశ్వరపురంలో కైగాల శ్రీనివాస్, గజ్జరంలో కొర్లపాటి దత్తుడు, పెదవేగి బాలాజీ, గన్ని సత్తిబాబు, మలకపల్లిలో చెరుకూరి వెంకట్రావు, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, అన్నదేవరపేటలో అల్లూరి విక్రమాదిత్య, సత్యేంద్ర, గణపతి, కొఠారు వెంకట్రావు, తాడిపూడిలో జనసేన మండలాధ్యక్షుడు గంటా కృష్ణ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది.



ఉండ్రాజవరం:పసలపూడిలో దివ్యాంగుడికి పింఛను అందజేస్తున్న దృశ్యం



చాగల్లులో పింఛను అందజేస్తున్న దృశ్యం



పెరవలి: తీపర్రులో పింఛన్ అందజేస్తున్న మంత్రి దుర్గేష్

ప్రజా సంక్షేమమే ధ్యేయం: మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 1: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం గోపవరంలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార్లతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 28 వర్గాలకు చెందిన 65,18,496 మంది లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛను అందిస్తున్నామన్నారు. శేషారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 35,817 మంది లబ్ధిదారులకు రూ.7 వేలు చొప్పున రూ.24.18 కోట్లను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, ఎంపీడీవో జేఏ ఝాన్సీ తదితర్లు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో గోపాలపురం ప్రథమ స్థానం

గోపాలపురం, జూలై 1: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో జిల్లాలోనే గోపాలపురం మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో కె.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 9238 మంది లబ్ధిదారులు ఉండగా రూ.6,30,14,500 పంపిణీ చేయాలన్నారు. అయితే మొదటి రోజైన సోమవారం మండల వ్యాప్తంగా రూ.6,15,77,000(97.72శాతం) పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన 132మంది సిబ్బందిని 9మంది సూపర్‌వైజర్లను అభినందించారు.

టీడీపీ ప్రభుత్వంలోనే రైతులకు మేలు

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- పైడిమెట్ట ఎత్తిపోతల పథకం కార్యవర్గ సమావేశం

తాళ్లపూడి, జూలై 1: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రైతులకు మేలు జరిగిందని, వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం వద్ద సోమవారం జరిగిన నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మెట్ట ప్రాంతాల్లో సాగునీటి కోసం టీడీపీ ప్రభుత్వం ముందుచూపుతో పంటలకు నీరందించాలన్న ఆలోచనతో గోదావరి తీరంలో ఎత్తిపోతల పథకాలను నిర్మించారన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఈ ప్రాంత పరిస్థితిని సీఎం చంద్రబాబు, నీటిపారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లాలనని, అంతేకాక కొవ్వాడలో గుర్రపుడెక్క తొలగించాలని తెలియజేశానన్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిన పరిస్థితిలో ఒక్కొక్కటిగా పనులు చేపడతామని, అంతవరకూ తాత్కాలిక మరమ్మతులతో, రైతుల సహకారంతో ముందుకు నడిపిద్దామని అన్నారు. రైతులు నీటి తీరువా సకాలంలో చెల్లించి సహకారం అందించాలని, భవిష్యత్‌లో శాశ్వత పనులు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడతూ నాయకులు, కార్యకర్తలందరూ ప్రజలకు సేవకులుగా పనిచేసి, నియోజక అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, టీవీ రామారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, ఇందుగుల రామకృష్ణ, పలు గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

అమరావతి రూపురేఖలు మార్చేశారు!

- రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి
- దేశ, విదేశ పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళిక
- రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్

పెరవలి, జూలై 1: గత ఐదేళ్లలో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా మారిందని, పోలవరం ప్రాజెక్టు నాశనం చేయడంతోపాటు అమరావతిని కూడా రూపురేఖలు మార్చి వేశారని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడి రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. పింఛన్ల పంపిణీ నిమిత్తం పెరవలి మండలం తీపర్రు వచ్చిన ఆయన కొద్ది సేపు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఖజానాను జగన్ ప్రభుత్వం ఖాళీ చేయడంతో ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే కష్టతరంగా మారిందన్నారు. రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి దేశ, విదేశ పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కడియం నర్సరీలను అభివృద్ధి చేయడం ద్వారా టూరిజం, వివిధ ఆలయాలను అభివృద్ధి చేయడం ద్వారా టెంపుల్ టూరిజం, ప్రకృతి ప్రదేశాలు అభివృద్ధి చేయడం ద్వారా హెరిటేజ్ టూరిజం అభివృద్ధి చేస్తామని దుర్గేష్ పేర్కొన్నారు. విశాఖపట్టణం, తిరుపతి పరిసర ప్రాంతాల్లో టూరిజం బాగా అభివృద్ధి చెందుతోందని, రాజమహేంద్రవరంలో హేవలాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేసి పిచ్చుకలలంక పరిసర ప్రాంతాలను కూడా టూరిజం పాటుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని నామినేటెడ్ పోస్టులన్నీ రద్దు చేశారని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులను టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి సమన్వయంతో ఎంపిక చేసి ఆ పోస్టుల్లో నియమిస్తామని, దానికి ఇంకా సమయం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా వినాయక, రాజరాజ నరేంద్ర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. గ్రామంలో సుమారు 15 మంది లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్ సొమ్ములు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, అతికాల శ్రీను, పిప్పర రవి, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, మొగళ్ళపు సీతారాం, ప్రత్తిపాటి వీరభద్రకుమార్ పాల్గొన్నారు.

డయేరియాపై మరింత అవగాహన కలిగించాలి



నల్లజర్లలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, జూలై 1: డయేరియాపై వైద్య సిబ్బంది గ్రామ స్థాయిలో మరింత అవగాహన కల్పించి ప్రజలకు సేవలందించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కోరారు. సోమవారం నల్లజర్ల పీహెచ్‌సీలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అతిసారకు బై చెబుతూ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఏ ఒక్కరిని అతిసార తాకకుండా ఆదర్శ ఆరోగ్యవంతమైన ఆరోగ్య ప్రాంతంగా నల్లజర్లను నిలుపుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు తెల్లం గంగాధర్, సిరాజుద్దీన్, జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, కండెపు వెంకటరత్నం, రావూరి వెంకటరమణ, యలమాటి శ్రీనివాసరావు, వల్లూరి సత్తిపండు, సీఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెంలో డయేరియా కలవరంతో వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. పంచాయతీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సర్వే చేశారని, ఎక్కడ ఎటువంటి డయేరియా కనిపించలేదని హుకుంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాభవాని తెలిపారు. ప్రయివేటు పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. కర్మాగారం వద్దే వైద్య శిబిరం ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. గ్రామంలో డయేరియా రాకుండా బ్లీచింగ్ చల్లించామని, ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. పంచాయతీ కార్యదర్శి సురేష్ మాటాడుతూ వైద్య ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తున్నారన్నారు.



గోపాలపురం: గుడ్డిగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నల్లజర్లలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం, చివటం గ్రామాల్లో స్టాప్ డయేరియా నివారణకు కార్యక్రమాలు నిర్వహించారు. డయేరియా వల్ల వచ్చే అనర్థాలను వైద్య సిబ్బంది ప్రజలకు వివరించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో నాయకులు గన్నమని వెంకటబ్రహ్మణ్యం, వీరమళ్ల బాలాజీ, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, ఈడ్పుగంటి సత్యనారాయణ, వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్

కొవ్వూరు, జూలై 1: కొవ్వూరు మండలం దొమ్మేరు పీహెచ్‌సీలో సోమవారం నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్టు డాక్టర్ ఎస్.ధర్మరాజు తెలిపారు. ఈ మేరకు క్యాంపెయిన్‌ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియాపై అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి పీహెచ్‌సీ, హెల్త్‌క్లినిక్‌లలో ఓఆర్ఎస్, జింకు కార్నర్‌లు అందుబాటులో ఉంచారని, ఎవరైనా డయేరియా లక్షణాలతో బాధపడుతుంటే అక్కడికి వెళ్తే ఓఆర్ఎస్, జింకు టాబ్లెట్స్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, సర్పంచ్ తానేటి కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	మనమే
వై.స్క్రీన్ 2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	కల్కి
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	కల్కి
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1	గంగం గణేశా
స్ర్కీన్ 2	---
శ్రీనివాస	---